జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 04 డిసెంబర్ 2025 | సంపుటి: 18 | సంచిక: 269 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

విశ్వావసు నామ సంవత్సరం , మార్గశిర మాసము , దక్షణాయణము , హేమంత రుతువు , సూర్యోదయం : 06:26 AM , సూర్యాస్తమయం : 05:53 PM. దిన ఆనందాది యోగము : లంబన యోగము , ఫలితము: తలచిన పనులలో సమస్యలు వస్తాయి

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## బెంగాల్‌లో సర్ సక్రమంగా సాగేలా చూడండి

బిజెపి ఎంపిలకు మోడీ హితోక్తులు

న్యూఢిల్లీ,డిసెంబరు3 (ప్రజాజ్యోతి):
పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ


మిగతా1 2లో..

## రియల్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు

న్యూఢిల్లీ,డిసెంబర్3(ప్రజాజ్యోతి):
క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే తెలంగాణ ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్

మిగతా 2లో..



# గ్లోబల్ సమిట్‌కు రండి

- తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం
- రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్రమంత్రులకు ఇన్విటేషన్
- భట్టితో కలసి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి
- దేవుళ్లపై వ్యాఖ్యలను వక్రీకరించారని ఆగ్రహం

న్యూఢిల్లీ,డిసెంబర్3(ప్రజాజ్యోతి):
దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలసి ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మిగతా 12లో..

# మహానగరంగా ఇక.. హైదరాబాద్

- జిహెచ్ఎంసిలో 27 మున్సిపాలిటీల విలీనం
- మున్సిపల్ రికార్డులను స్వాధీనం
- సిబ్బంది వివరాలు తెలియచేయాలని సూచనలు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రత్యేక ఆదేశాలు జారీ

హైదరాబాద్,డిసెంబరు3 (ప్రజాజ్యోతి):
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 27 మున్సిపాలిటీల విలీనం పక్రియ వేగవంతం అయింది. ఇప్పటికే ప్రభుత్వం పంపిన ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ప్రత్యేక ఆదేశాలను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో రికార్డులను స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు రికార్డ్స్ స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రత్యేకంగా రికార్డ్స్ ప్రొఫార్మ రూపొందించాలని తెలిపారు. ఇక, 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితాను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ లో విలీనం అయ్యే 27 మున్సిపాలిటీలలో ఉన్న సిబ్బంది వివరాలను తక్షణమే అందించాలని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పూర్తి వివరాలు సమర్పించాల్సిందిగా లేఖరాశారు. జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల పక్రియ వేగవంతం చేసేందుకు అత్యవసరంగా ఈ డేటాను కోరినట్లు కమిషనర్ లేఖలో స్పష్టం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్-1955లో వచ్చిన తాజా ఆర్డినెన్స్‌ల ఆధారంగా విస్తరణకు అనుమతి ఉత్తర్వులు జారీ చేసింది.

ఇప్పటి నుంచి మొత్తం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ జీహెచ్ఎంసీ పరిధిలో భాగం కానుంది.

ఈ మేరకు కోర్ అర్బన్ రీజియన్ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. జీహెచ్ఎంసీని ఇప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద అర్బన్ అడ్మినిస్ట్రేటివ్ యూనిట్‌గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితా విడుదల చేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు.



# త్వరలోనే మరో 40వేల ఉద్యోగాల భర్తీ

- ఇప్పటికే 60వేల ఉద్యోగాలు భర్తీచేసాం
- హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేసేదిలేదు
- తెలంగాణ ఉద్యమ జ్వాలలకు కరీంనగర్ కేంద్రం
- ఎట్టి పరిస్థితుల్లోనూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిచేస్తాం
- బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఏమయ్యిందో చూశాం
- రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం
- సమర్థులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోండి
- హుస్నాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి



సిద్దిపేట,డిసెంబరు3 (ప్రజాజ్యోతి):
రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.262. 68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.ఇచ్చిన హామీ మేరకు త్వరలో మరో 40వేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చాం.

మిగతా 2లో..

# భూ భారతిని సమగ్రంగా తయారు చేశాం

- ప్రజలు మెచ్చే విధంగా భూభారతి చట్టం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి
- భూదార్ కార్డులపై ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్,డిసెంబర్3(ప్రజాజ్యోతి):
భూదార్ కార్డులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూ భారతిలో నియమ నిబంధనలు కఠినతరం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి కోర్టుకు వెళ్లకుండా భూ భారతిని సమగ్రంగా తయారు చేశామన్నారు. 9 లక్షల ఫిర్యాదుల్లో న్యాయపరమైనవి పరిష్కరించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలోని ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామని

మిగతా 12లో..

## హిందూదేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు

- గాంధీభవన్ ముట్టడికి బిజెపి యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. స్వల్ప ఉద్రిక్తత

హైదరాబాద్, డిసెంబర్3(ప్రజాజ్యోతి):
నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి

మిగతా 12లో..

# ఛత్తీస్‌గడ్‌లో మరో.. ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోలు.. ఒక పోలీస్ మృతి

బీజాపూర్,డిసెంబర్3(ప్రజాజ్యోతి):
అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. కేంద్రహోంశాఖ విధించిన గడువు సమీపిస్తున్న కొద్దీ అరణ్యాలు కాల్పుల మోతతో దద్దరిల్లుతున్నాయి. బుధవారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని అడవిలో భద్రతా సిబ్బందికి, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయని అన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు, పోలీసుల డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) మరణించినట్లు తెలిపారు. మరో జవాన్‌కి గాయాలయ్యాయని అన్నారు. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుండి మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రాష్ట్రపోలీసుల్లోని రెండు విభాగాలైన డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ మరియు సిఆర్‌పిఎఫ్ ఎలైట్ గ్రూప్ కోబ్రా ( కమాండో బెటాలియన్ ఫర్ రిసోల్యూట్ యాక్షన్ ) ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని ఆ అధికారి తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటివరకు 268మంది మావోయిస్టులు మరణించారు.





# కోకాపేటలో కాసులు కురిపిస్తున్న వేలం

హెచ్ఎండీఏ ఖాతాలో మరో వేయికోట్లు

హైదరాబాద్,డిసెంబర్3(ప్రజాజ్యోతి):
కోకాపేట నియోపొలిస్ భూములకు మూడో విడత వేలం పక్రియ ముగిసింది. బుధవారం ప్లాట్ నెంబర్ 19, 20లోని 8.04 ఎకరాలకు అధికారులు ఈ-వేలం నిర్వహించారు. ప్లాట్ నెంబర్ 19లో ఎకరానికి రూ.131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20లో ఎకరం రూ.118 కోట్ల ధర పలికింది. 8.04 ఎకరాలకు

మిగతా 2లో..

## మూగ బాలుడిపై కుక్కల దాడి

మెరుగైన వైద్యం అందించాలని రేవంత్ ఆదేశం

హైదరాబాద్,డిసెంబర్3(ప్రజాజ్యోతి):
హయత్‌నగర్‌లో మూగ బాలుడు ప్రేమ్ చంద్‌పై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనపై ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారులతో ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాలుడి పరిస్థితిపై ఆయన తీవ్ర ఆవేదన వ

మిగతా 12లో..

# సంపాదకీయం


## ఎన్నికల సంస్కరణలపై చర్చించే దమ్ముందా ?

పార్లమెంట్ బృహత్తర బాధ్యతను నిర్వహించాల్సిన సమయం వచ్చింది. సమగ్ర ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. దీనిపై పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలి. అప్పుడే ఎన్నికల సంస్కరలప చర్చకు అర్థం ఉంటుంది. రాజ్యాంగం గురించి గొప్పగా మాట్లాడుతున్న వారు అప్పుడు రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల సంఘంపై విమర్శలు చేయకుండా చూడాలి. అలా చేస్తే శిక్షార్హులు అయ్యేలా చేయగలగాలి. సర్‌పై చర్చకు అనుమతించినందున పార్లమెంటులో ఈ అంశాలన్నీ చర్చించాలి. అనేకానేక అంశాలు చర్చ చేయాలి. దేశానికి గుదిబండగా మారిన గవర్నర్ వ్యవస్థ, మండలి వ్యవస్థ, ఒకే వ్యక్తి వరుసగా చట్టసభలకు ఎన్నికవ్వడం, డబుల్ పెన్షన్లు పొందడం వంటివన్నీ ఈ ఎన్నికల సంస్కరణలపై జరిగే చర్చలో భాగం కావాలి. అప్పుడే ప్రభుత్వ చిత్తశుద్ది కూడా బయట పడుతుంది. అలాగే విపక్షాల నిజాయితీ కూడా ప్రజలకు తెలుస్తుంది. ఎన్నికల సంస్కరణలపై తూతూ మంత్రంగా చర్చించకుండా ఈ అంశాలను చర్చించాలి. విపక్షాల సూచనలనలు పరిగణించాలి. అంతా కలసి సమగ్ర ఎన్నికల విధానం రూపొందించాలి. అలాగే ఇటీవల పదవీ విరమణ చేస్తూ..సుప్రీం ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను కూడా చర్చించాలి.ఎస్సీల్లో క్రిమిలేయర్ వర్తింప చేయాలన్న సూచనలు సభముందు చర్చించాలి. ఇకపోతే... ఇంతగా టెక్నాలజీ పెరిగినా..దానిని కేంద్ర ఎన్నికల సంఘం వినియోగించుకోవడం లేదేమో అని అనిపిస్తోంది. ఓటర్ల జాబితా మొదలు, ఓటరు నమోదు ప్రక్రియన సులువుగా చేయడం, లేని ఓట్లను తొలగించడం అన్నది సులువుగా జరగాలి. కానీ అలా జరగడం లేదనడానికి సర్ ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు రుజువు చేస్తున్నాయి. ఇటీవల ఉడాయ్ 2కోట్ల ఆధార్ కార్డులన నంబర్లను తొలగించింది. ఎక్కడా గందరగోళ రాలేదు. కాన ఓటు వషయంలో మాత్రం గందరగోళం ఏర్పడుతోంది. పక్కాగా ఓటు నమోదు, జాబితా రూపకల్పన, ఓటు అడ్రస్ మార్చుకోవడం అన్నది కంప్యూటర్ ముందు కూర్చుంటే అయిపోవాలి. నకిలీ ఓటు నమోదయితే కఠిన శిక్షలు అమలు కావాలి. మనదేశంలో తప్పులకు కఠిన శిక్షలు లేకపోవడం వల్లనే నేరాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం ఈ తరహాలో ఆలోచన చేయాలి. ఓటును ఆధార్‌తో అనుసంధానం చేయడమే గాకుండా పక్కా ఓటరు కార్డు, జాబితాను రూపొందించాలి. సర్ లాంటి ప్రక్రియను ప్రతి ఎన్నికలకు ముందు జరపాలి. దొంగ ఓట్లను, చనిపోయిన వారి ఓట్లను నిరంతరం తొలగించేలా వ్యవస్థను రూపొందించాలి. ఇకపోతే భారత ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్, దాని అమలు విధానం సర్వత్రా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో భవిష్యత్‌లో ఇలాంటి వివాదాలు రాకుండా పక్కాగా లక్ష్యాలను నిర్దేశించేలా పార్లమెంట్ చట్టాలను ఆమోదించాలి. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తోపాటు గుజరాత్‌లో సర్‌పై వివాదాలు రాకుండా చేయగలగాలి. ఇకపోతే బిఎల్‌ఓల మృతి వార్తలను దీనికి ఆపాదిస్తూ అసలు వ్యవస్థ పనిచేయకుండా చేయాలన్న మమతా బెనర్జీ లాంటి వారికి గట్టిగా సమాధానం చెప్పాలి. బీహార్‌లో ప్రారంభమైన ఎస్ఐఆర్ పక్రియ రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు విచారించింది. ఇసి నుంచి వివరాలు తీసుకుంది. అయినా వివాదాలు సృష్టించేందకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు సరికాదు. ఇది రాజ్యాంగ విధులను అడ్డుకోవడం తప్ప మరోటి కాదు. ఓటర్లు బూత్ లెవల్ అధికారుల ద్వారా అందజేయ బడిన ఎన్యూమరేషన్ ఫారాలను నింపి, తమ వివరాలను 2002-2005 నాటి ఓటర్ల జాబితాలతో సరిపోల్చాలి. 12 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎక్కువ మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశామని ఇసిఐ చెబుతున్నది. నిజమైన ఓటర్లు నింపాదిగా ఉండవచ్చు. వచ్చే నెలలో విడుదల కాబోయే ముసాయిదా జాబితాల్లో నమోదుకి అవసరమైన పత్రాలపై కూడా గందరగోళం లేకుండా చూడాలి. ఇంటింటికీ వెళ్లాలని చెప్పిన మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో బిఎల్‌వోలు పనిచేయాలి. పక్కాగా సమాచారం సేకరించాలి. ప్రతి ఓటరూ పాత రికార్డులు లేదా ఇసిఐ పేర్కొన్న పత్రాల ఆధారంగా తన చెల్లుబాటు నిరూపించాలి. సవరించిన జాబితాల్లో తప్పుడు నమోదు సమస్యలను కూడా పరిశీలించడం ద్వారా ఎక్కడా ఎలాంటి అపోహలకు తావులేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. సార్వత్రిక వయోజన ఓటుహక్కును పరిరక్షించేందుకు, సాంకేతిక ఆధారిత డీ డూప్లికేషన్ తోపాటు, మరింత ఓర్పుతో ఇంటింటికీ వెళ్లి ధృవీకరణ చేసే పద్ధతిని ఇసిఐ ఎంచుకోవాలి. ప్రధానంగా టెక్నాలిజితీ నకిలీ ఓట్లకు చెక్ పెట్టవచ్చు. ఎఐ వినియోగం పెంచుకోవాలి. వయోజనులందరికీ ఓటుహక్కు పరిరక్షణ కంటే మరో ధర్మం ఉండరాదు. ఎన్నో సంవత్సరాలుగా ఓటర్ల జాబితాల్లో ఉన్న పౌరులు తమ అర్హతను నిరూపించుకోవాల్సిన పరిస్థితి రాకుండా చూడాలి. ఖచ్చితమైన నమోదు బాధ్యతను కేంద్ర ఎన్నికల సంఘం పాటించాలి. అంతేగాక గందరగోళానికి దారితీసేలా చర్యలు ఉండరాదు. ఈ క్రమంలో కేంద్రం కూడా చిత్తశుద్దితో వ్యవహరించాలి. ఓటరు నమోదు అన్నది వ్యవస్థీకృతం కావాలి. పక్కాగా ఓటు నమోదు సాగాలి. ఎన్నికల సంస్కరణలపై చర్చలో ఇలాంటి అంశాలను అన్నింటినీ చర్చించాలి. విపక్షాల సూచనలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. దేశం అభివృద్ధి చెందాలంటే పక్కా ఓటు నమోదు వ్యవహారం ఉండాలి. లోటుపాట్లను చర్చించి సమగ్ర విధానంతో ముందుకు సాగేలా సవరణలకు వెనకాడరాదు.

# త్వరలోనే మరో 40వేల ఉద్యోగాల భర్తీ

మొదటిపేజీ తరువాయి..

ప్రజాపాలన రెండున్నరేళ్లు పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం అన్నారు. పనిచేసే వాడిని, మంచోడిని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీలైనంత వరకు సర్పంచ్ లను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. పొంకనాలు కొట్టే వాడిని సర్పంచ్ గా ఎన్నుకోవద్దని చెప్పారు.
ఎడ్యుకేషన్,ఇరిగేషన్ పై మా ప్రభుత్వం దృష్టి పెట్టింది. నెహ్రూ స్ఫూర్తితోనే మేం ముందుకెళ్తున్నాం. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యింది. ఆనాడు ఎస్ఆర్ఎస్పీని నెహ్రూ కడితే ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆనాడు కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులే దేశానికి సేవలు అందిస్తున్నాయి. రూ.2 లక్షల రుణామాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం మాదే. వ్యవసాయం దండగ కాదు..పండగ చేసి నిరూపించాం. లక్షా4 వేల కోట్లు రైతుల కోసం మా ప్రభుత్వం ఖర్చు చేసింది. మహిళలకు ఫ్రీ బస్సులే కాదు..బస్సు ఓనర్లను చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అప్పగించాం. అడిగిన ప్రతీ పేద ఇంటికి రేషన్ కార్డు ఇచ్చాం. ఆనాడు దొడ్డు బియ్యం ఇస్తే పశువులకు దాణ పెట్టేవాళ్లు. మా ప్రభుత్వం వచ్చాక సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లునిర్మిస్తున్నాం. హుస్నాబాద్ లో దేవుళ్లేమైనా పాలించారా?. హుస్నాబాద్లో గౌరెల్లి రిజర్వాయర్ ఎందుకు పూర్తి కాలేదు. పదేండ్లు హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైంది. గౌరెల్లి రిజర్వాయర్లు పూర్తి చేసే భాధ్యత నాది. ఆనాడు సిద్దిపేట,సిరిసిల్ల ,గజ్వేల్ నియోజకవర్గాలే అభివృద్ధి అయ్యాయి. ఐటీఐ కాలేజీలన్నింటిని ఏటీసీలుగా మార్చాం. ఏటీసీలో చేరే ప్రతి విద్యార్థికి నెలనెలా రూ.2వేలు ఇస్తున్నాం. అని రేవంత్ అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే.. బహుజనులు దండు కట్టి ఉద్యమించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ఇక్కడి నుంచే ఉవ్వెత్తున ఎగసిపడిందని గుర్తుచేశారు. 2004లో కరీంనగర్ గడ్డ నుంచే తెలంగాణ ఇస్తానని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. 2014లో స్వరాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని వ్యాఖ్యానించారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో నిధులు ఎక్కువగా ఇచ్చారని.. మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. హుస్నాబాద్‌కు పదేళ్లు నిధులెందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు ఎన్ని నిధులైనా ఇచ్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో లాగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయబోనని చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో ఎవ్వరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా అలస్వతం ప్రదర్శించారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ ఎలా ఉందో?.. బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో అత్యధికంగా వరిని పండించేది మన రాష్ట్రంలోనే. వ్యవసాయం అంటే దండగ కాదు..
పండగ అని చేసి చూపించింది మన ప్రభుత్వమే. రాష్ట్రంలో రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టాం. రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారు. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.22,500 కోట్లు పేదల ఇళ్ల కోసం ఖర్చు చేస్తున్నాం. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యాయి. కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యం. త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం అని సీఎం ప్రకటించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ. 262.78 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ంఃఅ ఏర్పాటుతో పాటు రూ. 20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే, రూ. 8.60 కోట్లతో ఖిం యూనిట్ ఆఫీస్ కు శంకుస్థాపన చేశారు. ఇక, రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్- కొత్తపల్లి ప్యాకేజీ-1లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్- అక్కన్నపేట నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు తదితరులు సభలో పాల్గొన్నారు..



# కోతులను పారదోలే వారే ఓట్లకోసం రండి

జయశంకర్ భూపాలపల్లి,డిసెంబర్3(ప్రజాజ్యోతి): సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. మరోవైపు ప్రజలు కూడా ప్రధాన సమస్యలపై నిలదీస్తున్నారు. సాధారణంగా సర్పంచ్ అభ్యర్థులు ఓట్లు అడగడానికి వస్తే.. ఎవరైనా తమ ఊరిని అభివృద్ధి చేయాలని అడుగుతారు. విద్యుత్, నీటి కొరత వంటి సమస్యలను పరిష్కారం చేయాలని కోరతారు.
అయితే.. రేగొండ మండల ప్రజలు మాత్రం ఓ విచిత్ర కోరిక కోరారు. ఆ ఊర్లో వానరాల బెడద అధికమవడంతో.. ముందుగా వాటిని తరిమేయాలని సర్పంచ్ అభ్యర్థులను వేడుకుంటున్నారు. కోతులను ఊరి నుంచి దాటించాకే ఓట్ల ప్రచారం కోసం రండి.. లేదంటే ఓట్లు అడగవద్దని బహిరంగంగా పోస్టర్ కూడా వేశారు. ఆ పోస్టర్లో ఇంకా ఏముందంటే...'మా ఓటును అమ్మేది లేదు.. కోతులను తరిమి ఓట్లు అడిగేందుకు రండి. ప్రలోభాలకు లొంగి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయొద్దు. వజ్రాయుధం లాంటి ఓటుతో గ్రామీణాభివృద్ధికి బాటలు వేద్దాం. ఊరంతా వానరాల దాడుల్లో గాయాలైన బాధితులే. పత్తి, వరి, మిరప పంటలు.. కోతుల చేష్టలతో ఇంటికి చేరడం లేదు. రేగొండ మండల కేంద్రమైన మా గ్రామంలో పెద్ద సార్లు, పెద్ద పెద్ద లీడర్లు తిరుగుతున్నా.. మా గోడును పట్టించుకునే నాథుడే లేకుండాపోయారు. ఎన్నికల వేళ మా ఇల్లు తొక్కే నాయకుల్లారా.. కోతులను తరిమి ఎన్నికకు ముందే అభివృద్ధికి శ్రీకారం చుట్టి.. మీ చిత్తశుద్ధిని చాటుకోండి.' అని స్థానిక ఇన్‌స్పైర్ యూత్ అసోసియేషన్ తరఫున ఓ పోస్టర్‌లో రాసిపెట్టి అందరికీ కనిపించేలా వీధిలో గోడకు అతికించారు. రేగొండలో గోడకు అతికించిన పోస్టర్ ప్రస్తుతం.. ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీన్ని బట్టి ఆ ఊరి ప్రజలు కోతుల ద్వారా ఎంతగా ఇబ్బందులకు గురవుతున్నారో అర్థమవుతోందని నెట్టింట చర్చించుకుంటున్నారు. వారి న్యాయబద్ధమైన కోరికను నెరవేర్చి సర్పంచ్ అభ్యర్థులు చిత్తశుద్ధి చాటుకోవాలని పలువురు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతకు నామినేషన్ల గడువు మంగళవారంతో ముగిసింది. 193 మండలాల్లోని 4,332 గ్రామ పంచాయతీలు; 38,342 వార్డులకు సంబంధించిన నామినేషన్లను స్వీకరించారు. రెండో విడత నామినేషన్లను బుధవారం పరిశీలిస్తారు. డిసెంబర్ 6న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తారు. రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈనెల 14న జరగనున్నాయి. ఆరోజు మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.

# బెంగాల్‌లో సర్ సక్రమంగా సాగేలా చూడండి

మొదటిపేజీ తరువాయి..

ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. దాని నిర్వహణపై బెంగాల్‌కు చెందిన భాజపా ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారని సమాచారం. ఆ పక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదిలాఉంటే.. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన



చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఎన్ని కేంద్ర సంస్థలను రాష్ట్రంలోకి తీసుకువచ్చినా.. ఎంత ఖర్చుపెట్టినా తనను రాజకీయపరంగా ఓడించలేరని గతంలో విరుచుకుపడ్డారు. అలాగే 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుండా.. విపక్షాల ట్రాప్‌లో చిక్కవద్దని బెంగాల్ భాజపా ఎంపీలకు హితబోధ చేశారు. అంతేగాకుండా ఆ రాష్ట్రంలో భాజపా ఎదిగిన తీరును ప్రస్తావించారు. 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. 2021లో ఆ సంఖ్య 65కు చేరింది. స్థానిక అంశాలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని ఎంపీలతో పేర్కొన్నారు. కాగా.. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్‌ను విపక్షాలు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ స్పందన వచ్చింది.

# రియల్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ

మొదటిపేజీ తరువాయి..

ట్రాన్స్‌ఫర్మేషన్' హిల్ట్ పాలసీని తీసుకొచ్చిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ ఉందని ఆరోపించారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడలో పనిచేస్తున్న వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు సహకారం అందించకుండా పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూరుస్తోందని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు ఒక విధానం.. రైతులకు ఒక విధానమా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూర్చేలా అవినీతి జీవోను తెచ్చారన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లకు అనుమతిస్తే ట్రాఫిక్ పరిస్థితి ఏంటని నిలదీశారు.

# కోకాపేటలో కాసులు కురిపిస్తున్న వేలం

మొదటిపేజీ తరువాయి..

హెచ్ఎండీఏకు రూ. వెయ్యి కోట్ల మేర ఆదాయం సమకూరింది. మొత్తం 3 విడతల్లో ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలకు రూ.3,708 కోట్ల ఆదాయం లభించింది. ఈసారి మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో హెచ్ఎండీఏ వేలం వస్తోంది. కోకాపేట గోల్డెన్ మైల్‌లోని 2 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాలకు డిసెంబర్ 5న ఈ-వేలం వేయనుంది.



# రోడ్డు మరమ్మతుకు నోచుకోక ఆందోళన.. రామ్ సింగ్ తండా వాసులు

నర్సాపూర్ (ప్రజాజ్యోతి)
గత నాలుగు నెలల క్రితం భారీ వర్షాల కారణంగా ధ్వంసమైన రోడ్డును ఇప్పటికీ పట్టించుకోకపోవడంపై నర్సాపూర్ మండలం,



ఖాజీపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామ్ సింగ్ తండా వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం రోడ్డుపై ఆందోళన చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

**అత్యవసరానికి అంబులెన్స్ రాలేని దుస్థితి**

నాలుగు నెలల క్రితం వర్షాల ధాటికి తండాకు వెళ్లే రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. అప్పటి నుంచి రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. సక్రమమైన రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో, రోగులను ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్సులు కూడా తండాలోకి రాలేని పరిస్థితి నెలకొందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

**మాట మరిచి, తుంగలో తొక్కి**

ఎన్నికల సమయంలో ఓట్ల కోసం గ్రామానికి, తండాలకు వచ్చిన నాయకులు, రోడ్లు, గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ గెలిచాక మా మాటలను, మా అవస్థలను పూర్తిగా తుంగలో తొక్కేసారంటు తండా వాసులు మండిపడ్డారు.

**రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి**

రోడ్డు మరమ్మతుల గురించి అధికారులకు పలుమార్లు విన్నవించినా వారు కనీసం పట్టించుకున్న పాపాన పోలేరని తండావాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు తమ గోడును గుర్తించి, రోడ్డు మరమ్మతులు చేయించి రవాణా సౌకర్యం కల్పించాలని రామ్ సింగ్ తండా వాసులు ప్రభుత్వాన్ని కోరారు.





# మైక్రో అబ్జర్వర్లు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలి




**- గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3, (ప్రజాజ్యోతి) :** సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) తమ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అన్నారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నిక విధుల్లో పాల్గొనబోయే సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్ అయేషా మస్రత్ ఖానం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వహించబోయే అధికారులకు ముందుగానే సమాచారం అందించామని అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ఓటు విధానాన్ని వినియోగించుకొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. శిక్షకులు అందించిన సమాచారాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ, ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని వివరించారు.

**పంచాయితీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం**

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ :** పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా, ఎన్నికకు ముందు, ఎన్నిక సమయంలో, ఎన్నిక తర్వాత, ఓట్ల లెక్కింపు సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. సమయానుసారం ఓటింగ్ నమోదు వివరాలను పైఅధికారులకు ఎప్పటికప్పుడు అందజేయాలని అన్నారు. మైక్రో అబ్జర్వర్లకు అందించిన కరదీపికలను అనుసరించాలని చెప్పారు. ఎటువంటి సందేహాలు ఉన్న పై అధికారులను సంప్రదించాలని సూచించారు. రెండో దశలో భాగంగా మరోసారి సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ అందిస్తామని అన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్దేశించిన అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. పలువురు శిక్షకులు మైక్రో అబ్జర్వర్లకు తమ ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఎల్డీఎం రామ్ గోపాల్, శిక్షకులు, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మరమ్మత్తు పనులు పకడ్బందీగా చేపట్టాలి



**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3, (ప్రజాజ్యోతి) :** నిర్మల్ పట్టణంలో చేపట్టిన రోడ్ల మరమ్మత్తుల పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్, అంబేద్కర్ చౌక్ సమీపంలో కొనసాగుతున్న రోడ్డు మరమ్మత్తుల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణంలో గత వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులను సకాలంలో గా పూర్తి చేయాలని అన్నారు. గుంతల రోడ్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని వివరించారు. మరమ్మత్తుల పనులన్నింటినీ నాణ్యవంతంగా చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. వర్షాకాలం రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టాలని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్ నుంచి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ఫుట్ పాత్ కు మరమ్మత్తులు చేయాలని తెలిపారు. పట్టణంలో నిరంతరం మెరుగైన పారిశుధ్యం నిర్వహించాలని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటాలని సూచించారు. ఆటో స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆటో డ్రైవర్లకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలి నిర్మాణం పూర్తయిన మినీ ట్యాంక్ బండ్ పార్కును పకడ్బందీగా



నిర్వహించాలని తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారి హరిభువన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యా సీఎం రేవంత్ రెడ్డి మా ఖానా"పూర్"ను జరా కనికరించరు






**ఖానాపూర్ డిసెంబర్ 3(ప్రజాజ్యోతి) :** ఒకప్పటి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నేటి నిర్మల్ జిల్లాలోని వెనుకబడిన గిరిజన నియోజకవర్గమైన ఖానాపూర్ పై ప్రజా ప్రభుత్వ తెలంగాణ సాహస ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నియోజకవర్గంపై దృష్టి సారించరు ప్లీజ్.గత శతాబ్దన్నర ప్రాంతంలో సుమారు 130 సంవత్సరాల క్రితం నైజాం కాలం 1892 లొ ఈ ఖానాపూర్ ప్రాంత పంటల సస్యశ్యామలానికి మండలంలోని గిరిజన "మేడం పల్లి" గ్రామ పరివాహక గోదావరి నదిపై అడ్డుకట్టు వేసి ప్రత్యేక కాలువలు నిర్మించి" హే గోదావరి సదర్ కా మాట్" అని అందరూ పంటలు పండించుకోవాలని అప్పటి ఖానాపూర్ పాత తాలూకా ఖానాపూర్ కడెం ప్రాంత రైతాంగానికి సుమారు 12వెల ఎకరాల నీరు అందించడానికి రెండు పంటలు పండేందుకు ఈ సదరక మాట్ కృషిచేసింది. ఆ సదర్ కా మాటే రాను రాను "సదర్మాట్ "కాలువ చిన్న ప్రాజెక్టుగా ఈ ప్రాంతా రైతాంగానికి జీవన ఆధారంగా నిలిచింది సదర్మాట్ పట్టే అన్నం పెట్టే అన్న చందంగా పంటలు పండించుకొని గోదావరి పరివారక అవతల ప్రాంతాల నుంచి కూలీలుగావలస ఈ ప్రాంతానికి వచ్చి వాళ్లు పొట్ట పోసుకుంటూ ఈ ప్రాంతాన్ని సదర్ మాట్ అన్నపూర్ణ ప్రాంతంగా సదర్ మాట్ పట్టే అన్నం పెట్టే అని పిలిచేవాళ్లు అది రాను రాను అధికారుల నిర్లక్ష్యం స్థానిక నాయకుల పాపం ఈ సదర్ మాట్ కాల్వకు శాపంలా మారి సదర్మాట్ రైతాంగం అన్నమో రామచంద్రా అంటూ విలవిలలాడుతోంది. అనేక దశాబ్దాలుగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వాల నుంచి రాస్తారోకోలు ధర్నాలు సదర్ మాట్ ను ప్రత్యేక బ్యారేజ్గా నిర్మించాలంటూ పార్టీలకు అతీతంగా సదర్ మాట్ సాధన సమితి, రైతాంగంసమితి పోరాట సమితి, వామపక్షాలు, విపక్షాలు ప్రజలు స్వచ్ఛందంగా పోరాడి అమరణ నిరాహార దీక్షలు చేసిన సంఘటనలు ఉన్నాయి. కాంగ్రెస్ దివంగత ముఖ్యమంత్రి

- సదర్ మాట్ రైతాంగం అష్ట కష్టాలు
- "పొనకల్"కు తన్నుక పోయి రైతాంగం పొట్ట కొట్టారు
- స్వర్గీయ వైయస్సార్ సీఎం హాయంలో నిధులకు శ్రీకారం
- పాలకుల పాపం పక్కా నియోజకవర్గానికి తరలింపు
- 7 కిలోమీటర్ల ప్రత్యేక కాల్వ కోసం రైతాంగం గోస
- నేడు ముఖ్యమంత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటన

వైయస్సార్ హాయంలోనే "సదర్మాట్ బ్యారేజ్" గా నిర్మించడానికి 200కోట్ల నిధుల జీవో జారీ. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సదర్ మట్ ను ప్రత్యక్షంగా పరిశీలించి అప్పుడు 200 కోట్లు నిధుల కు జీవో జారీ చేసారు. అప్పుడు గల సదర్ మాట్ ప్రాంతంలోని పరివాహక ప్రాంతంలోని వెంకట పూర్, కుర్రు భూములు సేకరించి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.కాని ఖానాపూర్ ప్రాంత అనేక సంవత్సరాల ఆశలు సదర్ మాట్ బ్యారేజీ ద్వారా రైతాంగానికి రెండు పంటలు పండి సస్యశ్యామలంగా మారుతుందని ఎన్నో కలలు కన్నా రైతాంగా కళ్ళల్లో ఇప్పటి నిర్మల్ జిల్లా నాయకుల స్వార్థం, ఖానాపూర్ ప్రాంత స్థానిక నాయకుల పాపం వల్ల గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో 600వందల కోట్లపైగా నిధులు సధర్మట్ బ్యారేజ్ కి మంజూరు చేసి పక్క నియోజకవర్గమైన నిర్మల్ లోని పొనకల్ గ్రామంలో "సదర్ మాట్ బ్యారేజీ నిర్మించేశారు. ఖానాపూర్ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారు "అప్పటి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్వయంగా ఖానాపూర్ ఎన్నికల ప్రచారంలో సధార్మాట్ పట్టే రైతాంగానికి అన్యాయం జరగదు ఖానాపూర్ కడెం మండల ప్రాంత రైతాంగానికి ప్రత్యేకంగా 7 కిలోమీటర్ల కాలువను నిర్మించి పంటలకు నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ అది నెరవేరలేదు వందల కోట్ల కమిషన్లు, నిర్మాణానికి భూములకు నష్టపరిహారం కింద వందల కోట్లు అవినీతికి కక్కుర్తి పడి ఖానాపూర్ సదర్ మాట్ కెనాల్ ను పొనకల్ గ్రామం లో నిర్మించిన కళ్ళ గుడ్లు అప్పగించి చూసిన ఈ ఖానాపూర్ ప్రాంత స్థానిక నాయకులే నేడు సదర్ మాట్ పై కనీసం మొసలి కన్నీరు కార్చటానికి కూడా సాహసించడం లేదు. ప్రస్తుత ఆదివాసి పోరు బిడ్డ ముఖ్యమంత్రి సన్నిహితులుగా పేరుగాంచినవెడ్మ బొజ్జు పటేల్ కు ఈ సమస్యపై పూర్తి అవగాహన ఉంది గతంలోను కెనాల్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని పలు మార్లు సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులతో సైతం మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. కానీ అవి ఇప్పటికీ పనులు ప్రారంభించకపోవడంతో రైతాంగం నిరాశ నిస్రుహలతో ఉన్నారు. జముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు కేటాయించాలి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి గురువారం నేడు ఈ అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్ ప్రాంతానికి విచ్చేస్తున్న సందర్భంగా రేవంత్ రెడ్డి ఖానాపూర్ ముఖ్యంగా పాత తాలూకా వాసుల రైతాంగ శాశ్వత జీవన ఆధారమైన "సదర్మాట్ "పై దృష్టి సారించి జర కనికరించాలని రైతాంగం హృదయ పూర్వకంగా కోరుతున్నారు ఈ సభలోనే సధార్మట్ ఖానాపూర్ కాలువకు ప్రత్యేక కెనాల్ 7 కిలోమీటర్లకు నిధులు మంజూరు చేయాలని సదా సర్వదా ఈ ప్రాంత రైతాంగం కోరుతుంది అలాగే ఖానాపూర్ నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన వెనుకబడిన ప్రాంతంగా పేరున్నా ఖానాపూర్లో ఇప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలేదు, అలాగె ఇంటిగ్రేటర్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరి చేయించి ఈ ప్రాంతా అభివృద్ధి కాంక్షించాలని ముక్తకంఠంతో ఖానాపూర్ ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బిజెపి రాస్తారోకో..


**తాండూర్, డిసెంబర్ 3 ప్రజాజ్యోతి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడాన్ని నిరసిస్తూ బిజెపి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రం ఐబిలో జాతీయ రహదారిపై రాస్తా రోకో చేపట్టారు. ముఖ్యమంత్రి బేషరతుగా హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మెజారిటీ ప్రజలైన హిందూ ప్రజల ఆరాధ్యదేవతలైనటువంటి దేవీ దేవతలను అవమానించడం ఒక మతపు ప్రజల మన్నలను పొందడం కోసమేనని అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని అన్నారు. అనంతరం మండలంలోని జిన్నింగ్ మిల్లులను సందర్శించి పత్తి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కౌలు రైతుల సమస్యలను వ్యవసాయ అధికారులు పరిగణలోకి తీసుకొని వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు,రాష్ట్ర సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, పులగం తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రావణ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింగ్, మండల ఉపాధ్యక్షుడు కొండ రవి, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అద్వాల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆమ్ ఆద్మీ పార్టీ సర్పంచ్ అభ్యర్థి శేక్ సిమ్రాన్ నామినేషన్ దాఖలు



**నిర్మల్, డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలో ఈరోజు సర్పంచ్ ఎన్నికల బరిలో ఆమ్ ఆద్మీ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని శేక్ సిమ్రాన్ నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. శేక్ సిమ్రాన్,భర్త శేక్ ఇలియాస్ సమక్షంలో, పార్టీ నాయకులు నిర్మల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ హైదర్ సమక్షంలో మరియు గ్రామ ప్రజలతో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకొని పత్రాలను సమర్పించారు. గ్రామ అభివృద్ధి దిశగా తమ అభ్యర్థిని ప్రకటిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తి స్థాయిలో శేక్ సిమ్రాన్ కి మద్దతు ప్రకటించింది.

## హిందూ సమాజానికి సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

**- నిర్మల్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నాయకులు**




**నిర్మల్, డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్ళను అవమాన పరుస్తూ, హిందూ సమాజాన్ని కించపరిచే విధంగా మాట్లాడడాన్ని నిరసిస్తూ బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో ముస్లిం అంటే కాంగ్రెస్,కాంగ్రెస్ అంటే ముస్లిం అని మాట్లాడిన రేవంత్ రెడ్డి హిందువులను, హిందూ దేవీదేవతలను ఇలా అవమానపరచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మతస్తుల దేవుళ్లపై వ్యాఖ్యలు చేసే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. హిందూ దేవుళ్ళను తూలనాడిన సిఎం ముక్కు నేలకురాకి హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మ రాజు, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు ఒడిసెల అర్జున్,అల్లం భాస్కర్, శ్రీ రామోజీ నరేష్, నాయకులు పొన్నం నారాయణ గౌడ్, ఆడెపు సుధాకర్, తోట సత్యనారాయణ, అయ్యన్న గారి రాజేందర్, కొండాజి శ్రావణ్, విజయ్, జప ప్రసాద్, గంజి రాజు, ఓడ్నాల రాజు, రంజిత్, దిలీప్, సాత్విక్, రాము, మహేష్, రవి,లింగం, బంటి, పట్టణ బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ మండల ప్రజా పరిషత్‌లో ఎన్నికల సామాగ్రిని పరిశీలించిన సీఈఓ శంకర్



**ఖానాపూర్ డిసెంబర్ 3 (ప్రజాజ్యోతి) :** ఈనెల 11 మొదటి విడతగా జరగనున్న సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల సందర్భంగా ఖానాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సామాగ్రి బ్యాలెట్ పేపర్ తదితర బాక్స్ లను నిర్మల్ జిల్లా ప్రజా పరిషత్ సీఈవో శంకర్ బుధవారం పరిశీలించారు బ్యాలెట్ పేపర్లు బాక్సులు ఓటర్ లిస్ట్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్ ఎంపీఓ రత్నాకర్ రావు సూపర్డెంట్ స్వామి ఎన్నికల రిటర్నింగ్ అధికారి జివిల్వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇది మీకు తెలుసా !





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3, (ప్రజాజ్యోతి) :** పంచాయితీ ఎన్నికల్లో ఒక అభ్యర్థి వార్డు సభ్యునిగా, సర్పంచిగా రెండింటికి పోటి చేయవచ్చు. మండల పరిషత్తు( ఎంపిటిసి), జిల్లా పరిషత్తు (జడ్పీటిసి) టేరిటోరియల్ కాన్స్టీ ట్యూయెన్సీకి రెండింటికి నామినేషన్లు సమర్పించి బరిలో దిగవచ్చు. అభ్యర్థి పోటిచేసిన రెండు పదవులలో విజయం సాధిస్తే తనకు నచ్చిన పదవిలో కోనసాగుతూ రెండవ దానిని 15 రోజుల్లో తప్పుకోవాలి. నిర్ధేశించిన 15 రోజుల్లో ఒక పదవిని అధికారికంగా తప్పుకోక పోతే నిబంధనల ప్రకారం రెండు పదవులు కోల్పోతారు.

## చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధనకై నిరసన ప్రదర్శన




**మంచిర్యాల, 03, డిసెంబర్, (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఇప్పుడు నడుస్తు న్న పార్లమెంటు సమావేశాలలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల బిల్లు పెట్టి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బీసీలకు చట్టసభలలో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమన్నారు. దేశ జనాభా లో 10 శాతం లేని అగ్రకులాలే దేశాన్ని రాష్ట్రాన్ని 79 సంవత్సరాలుగా పాలిస్తున్నారు దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు పాలించబడుతున్నారని, ఇదేనా ప్రజాస్వామ్యం, ఇదేనా సామాజిక న్యాయమని అడుగుతున్నామన్నారు. అలాగే పార్లమెంట్లో ప్రాతినిధ్యం వహిస్తున్న 36 రాజకీయ పార్టీల నుండి 32 పార్టీలు బీసీ రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా ఉన్నాయని, 9 రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపినప్పటికీ బీసీ బిల్లు ఎందుకు ప్రవేశపెట్టడం లేదని బిజెపి ప్రభుత్వం బీసీ సమాజానికి చెప్పవలసిన అవసరం ఉందని అన్నారు. గత 40 సంవత్సరాలు చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమాలు నడుస్తున్నప్పటికీ తమ న్యాయమైన మా ప్రజాస్వామ్య వాటాకై ఉద్యమం చేస్తున్నప్పటికీ తమ డిమాండ్ ను గత కాంగ్రెస్ ప్రభుత్వంగాని ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గానీ పెడచెవిన పెట్టడం అంటే ఇది పూర్తిగా బీసీల పట్ల వివక్షతనే అన్నారు. ప్రజాస్వామ్యం సుస్థిరంగా ఉండాలంటే ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంతా ఉండాలని, ఇప్పటికైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఇప్పుడు నడుస్తున్న పార్లమెంటు సమావేశాలలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టాలని, లేనిపక్షంలో ఈ అంశాన్ని బీసీ సమాజం దృష్టికి తీసుకెళ్లి బీసీ సమాజం ముందు బిజెపిని దోషిగా నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్ బీసీ నాయకులు గజల్లి వెంకటయ్య, షాకపూరి భీమ్సేన్ ఆరెందుల, రాజేశం అంకం సతీష్, చలిమల అంజయ్య, అంకం సతీష్, పెద్దపల్లి సూరయ్య, రాజన్న, చారి, శెట్టిపల్లి గట్టయ్య, ధర్మాజీ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా తొలి విడత పోలింగ్ సిబ్బంది ఎంపిక:జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్

గద్వాల డిసెంబర్ 03(ప్రజా జ్యోతి ప్రతినిధి): 2వ,సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు.బుధవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు గంగాధర్ తో కలిసి




తొలి విడత పోలింగ్ సిబ్బందికి రెండవ ర్యాండమైజేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలోని గద్వాల్,ధరూర్,కేటీ దొడ్డి,గట్టు (4)మండలాల్లో నిర్వహించనున్న తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొత్తం 974 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.వీటిలో విధులు నిర్వర్తించడానికి పీఓలు 974, ఓపీఓలు1,236 సిబ్బందిని రెండవ ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.ఒక్కో మండలానికి సంబంధించిన గ్రామ పంచాయతీలలో సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికల కోసం అవసరమైన పోలింగ్ అధికారులను ర్యాండమైజేషన్ విధానంలో కేటాయించినట్లు తెలిపారు.పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసి సాఫ్ట్ వెర్ వినియోగిస్తూ ఆన్లైన్ లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తీ చేయడం జరిగిందని తెలిపారు.జిల్లాలో గ్రామస్థాయి ఎన్నికలను పరదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీకాంత్,జెడ్పీ డిప్యూటీ సి.ఈ.ఓ నాగేంద్రం,ఈడియం శివ, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ ధ్రువపత్రాలను సక్రమంగా పరిశీలించాలి

**- ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలి**

**- రిటర్నింగ్ అధికారులకు ఆదేశించిన కలెక్టర్**

వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 3 (ప్రజా జ్యోతి): మూడో దశ గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం పరిశీలించారు. పెబ్బేరు, శ్రీరంగాపూర్, వీపనగండ్ల, చిన్నంబావి, పాన్గల్ మండలాల్లో కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, అభ్యర్థులు సమర్పించే ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకుని సక్రమంగా పరిశీలించాలని రిటర్నింగ్ అధికారులకు ఆదేశించారు. సర్పంచ్, వార్డు మెంబర్





అభ్యర్థుల ప్రపోజర్లు ఏ కులానికైనా చెందినవారై ఉండొచ్చని స్పష్టం చేశారు. నామినేషన్లపై ప్రతిరోజు టీ-పోల్ యాప్‌లో అప్డేట్ చేయాలని, కేంద్రాల్లో ఓటర్ జాబితా, ఫారం-1 తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

## రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి

**-క్రీడాకారులను అభినందించిన మంత్రి వాకిటి శ్రీహరి**

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,డిసెంబర్ 03 (ప్రజా జ్యోతి): కెట్ పోటీ రాష్ట్రస్థాయి ఎసీజీఎఫ్ క్రికెట్ పోటీలో ప్రతిభ కనబరుస్తూ జిల్లా జట్టు విన్నర్‌గా నిలవాలని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అండర్ 14 క్రికెట్ జట్టు ఈ రోజు నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణం నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అండర్ 14 బాలుర



క్రికెట్ జట్టు భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడలకు బయల్దేరి వెళ్లింది. ఈ సందర్భంగా క్రీడాకారులను మంత్రి వాకిటి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ మీకు అవసరమైన సదుపాయాలును కల్పిస్తానని తెలిపారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రదర్శన కనబరిచి జిల్లాకు పేరు తీసుకొని రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవై ఎస్ఓ వెంకటేష్ శెట్టి, క్రీడా దుస్తుల దాత లక్ష్మీనారాయణ, టీం మేనేజర్‌గా విష్ణువర్ధన్, కోచ్ వలియోద్దీన్

## దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే ఏదైనా సాధించవచ్చు:అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల డిసెంబర్ 03(ప్రజా జ్యోతి ప్రతినిధి): దివ్యాంగులు తమపై తమకు నమ్మకం, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చు అని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ (రెవిన్యూ) అన్నారు.బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను






పరిష్కరించుకొని గద్వాల ఇండోర్ మైదానంలోమహిళా,శిశు,దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ,జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ నర్సింగరావు (స్థానిక సంస్థలు)తో కలిసి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని,వారి హక్కులను కాపాడేందుకు వివిధ చట్టాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి ప్రత్యేక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ప్రతినెల చివరి రోజున ఆయా మండలాల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని,అక్కడ దివ్యాంగుల హక్కుల గురించి కూడా వివరించేలా సంబంధిత తహసీల్దారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ,జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో మహిళ వికలాంగ సంఘాలు కూడా ఏర్పాటు చేసి సభ్యుల ఉపాధి నిమిత్తం ప్రత్యేక రుణాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేసే విషయం ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. ప్రతి నెల సదరన్ క్యాంపులకు వచ్చే దివ్యాంగులకు వారి గ్రామాల నుంచి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి సహకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.అంతకుముందు పలువురు దివ్యాంగ సేవ సంఘం నేతలు మాట్లాడారు.అనంతరం దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు అందజేశారు.వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు దివ్యాంగులను సన్మానించారు.అంతకుముందు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గాంధీ చౌక్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు నిర్వహించిన ర్యాలీలో దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అంతకుముందు వైయస్సార్ చౌక్ వద్ద మానవహారం నిర్వహించి ర్యాలీగా బయలుదేరి ఇండోర్ స్టేడియంకు చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని సునంద,విద్యా శాఖ అధికారిని విజయలక్ష్మి,డివైఎస్ఓ కృష్ణయ్య,డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాసులు,డిసిపిఓ నరసింహా,జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధులు శ్రీనివాసులు,లక్ష్మణ స్వామి,జిల్లా దివ్యాంగుల సేవా సంఘం అధ్యక్షులు చంటిబాబు, బీసమ్మ,లక్ష్మీకాంతరెడ్డి,నరసింహులు,ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

## మొదలైన మూడవ దశ గ్రామ పంచాయతీ నామినేషన్ల పర్వం

**- ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యం అనుమతించం : పరిశీలకురాలు కాత్యాయని దేవి హెచ్చరిక**

మహబూబ్ నగర్ డిసెంబర్ 03 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్ నగర్ జిల్లాలో మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ బుధవారం అధికారికంగా ప్రారంభమైంది.

ఈ సందర్భంగా భూత్పూర్ మండలం అన్నాసాగర్-1 క్లస్టర్, మూసాపేట మండలం జానం పేట క్లస్టర్ గ్రామ పంచాయతీలను గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి పరిశీలించారు. సర్పంచ్ మరియు వార్డు సభ్యుల స్థానాలకు బుధ వారం నామినేషన్ స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన ఆమె, ఎన్నికల నోటిఫికేషన్, పత్రాలు, ప్రణాళికలపై సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలంటూ అధికారులు, సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఎలాంటి పొరపాట్లు, లోపాలకు తావులేకుండా, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించిన నియమావళినిబద్ధంగా పని చేయాలని ఆమె స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణలో పారదర్శకత ఉండాలని, నిర్ణీత గడువులో టోకెన్ల జారీచేసి అభ్యర్థులను సక్రమంగా క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలు, వ్యయ పరిమితి, లెక్కింపు విధానాలపై స్పష్టమైన అవగాహన



కల్పించాలని, ప్రతి రూపాయి లెక్క కచ్చితంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జానం పేట మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె, పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు, భద్రత, పోలింగ్ సామగ్రి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సబ్ ఇన్స్పెక్టర్, ఎంపిడీఓ, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు. తదుపరి మహమ్మదాబాద్ మండలంలో ఎంపిడీఓ కార్యాలయాన్ని సందర్శించిన పరిశీలకురాలు, పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని పరిశీలించి, వాటిని ముందస్తుగా సరిచూసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు సజావుగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.

## బీసీ సామర్థ్యానికి కాంగ్రెస్ గౌరవం

**- "సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా సంజీవ్ ముదిరాజ్‌కి డీసీసీ పగ్గాలు" : టీపీసీసీ ప్రతినిధి జహీర్ అక్తర్**

మహబూబ్ నగర్ డిసెంబర్ 03 ( ప్రజా జ్యోతి బ్యూరో ) ఏఐసీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంఘటన్ సృజన్



అభియాన్ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల నియామకం జరుగుతోందని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీలో 30 ఏళ్లుగా క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తున్న బీసీ నాయకుడు సంజీవ్ ముదిరాజ్‌ను మహబూబ్ నగర్ డీసీసీ అధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 14 మంది బీసీ నాయకులకు డీసీసీ బాధ్యతలు ఇవ్వడం పార్టీ బీసీ వర్గాల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన సంజీవ్ ముదిరాజ్ డిసెంబర్ 5వ తేదీన ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆయన నివాసం నుంచి భారీ ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకుంటారని, అనంతరం 11 గంటలకు బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అలాగే మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు, ఎమ్మెల్యేలతో పాటు పలు సీనియర్ నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడిన మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, మూడు నియోజకవర్గాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ, "సంజీవ్ ముదిరాజ్ నియామకం బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన గౌరవం" అని అన్నారు.

సీనియర్ నాయకులు చంద్రకుమార్ గౌడ్, డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్, శేఖర్ నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశాలు**

వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 3 (ప్రజా జ్యోతి): వనపర్తి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గోదాములు, మిల్లులను పర్యటించి తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యాన్ని వెంటనే కొని మిల్లులకు తరలించాల్సిందిగా



సూచించారు. నాచహళ్లి ఐకెపి కేంద్రంలో తేమ శాతం ఖచ్చితంగా పరీక్షించి, అన్ని రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రంగాపూర్ గ్రామంలో ఏఈఓ జారీ చేసే టోకెన్లను పరిశీలించి, సీరియల్ పద్ధతిలో టోకెన్లు ఇవ్వాలని సూచించారు. సూగురు గ్రామంలోని ఎస్డబ్ల్యుసి గోదాములో సీఎంఆర్ బియ్యం నాణ్యతను పరిశీలించి, నాణ్యత లేని బియ్యాన్ని వెంటనే తిరస్కరించాలని స్పష్టం చేశారు. అనంతరం సత్యసాయి ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో సీఎంఆర్ డెలివరీలను త్వరితగతిన పూర్తి చేయాలని మిల్లర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జగన్, తహసీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు..

## స్థానిక సంస్థల్లో బీజేపీ జెండా ఎగరవేయాలి

**- వనపర్తి జిల్లా ఇంచార్జీ బొక్క బాల్ రెడ్డి**

వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 3 (ప్రజా జ్యోతి): వనపర్తి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో వనపర్తి జిల్లా బీజేపీ ఇంచార్జ్‌గా నియమితులైన బొక్క బాల్ రెడ్డికి తొలిసారి వచ్చిన సందర్భంగా ఘన స్వాగతం లభించింది. జిల్లా అధ్యక్షులు డి.



నారాయణ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పని చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు 100% నిధులు మంజూరు చేస్తోందని, ఈ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా ప్రచారం చేయాలన్నారు. పది సంవత్సరాల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, అనంతరం కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని విమర్శించారు. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ (బిఆర్ఎస్) పార్టీలకు గుణపాఠం చెప్పి బీజేపీ జెండాను ఎగరవేయాలని నాయకులు, కార్యకర్తలను పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్, జిల్లా స్థానిక సంస్థల ఇంచార్జ్ మెంటంపల్లి పురుషోత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, కల్పన, జిల్లా ఉపాధ్యక్షులు బాసెట్టి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ సుమిత్రమ్మ, జిల్లా ఖజానాదికారి కుమారస్వామి, జిల్లా కార్యదర్శి బాలనగర్ సూరి, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, బోయల రామ్మోహన్, బచ్చురాములు, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, కిసాన్ మోర్చా నాయకులు రామ్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి దంతోజ్ నవీన్, పట్టణ ఉపాధ్యక్షులు ఉందే కోటి అంజి, ఓబీసీ మోర్చా రవి, రాయన్న సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యలో నాణ్యతా విప్లవం ప్రారంభం...!


మహబూబ్ నగర్ డిసెంబర్ 03 ( ప్రజా జ్యోతి బ్యూరో ) గత ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడ్డాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని తన స్వంత నిధులతో రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ స్టడీ మెటీరియల్స్‌ను పదవ తరగతి



విద్యార్థులకు ఆయన బుధవారం నగరంలోని ప్రభుత్వ కొనపాలమూరు, గాంధీ రోడ్, ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాలల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఐఐటీ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశం పొందేందుకు ఇది విలువైన మార్గం" అని తెలిపారు. నాణ్యమైన బోధన, సరైన మార్గదర్శకత అందితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా అత్యున్నత స్థాయికి చేరుకోగలరని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై నిర్లక్ష్యం కారణంగా అనేక అవకాశాలు దూరమయ్యాయని, ఇప్పుడు ప్రజల ప్రభుత్వం ఆ లోటును పూడ్చడానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. "రాబోయే విద్యా సంవత్సరంలో మహబూబ్ నగర్ విద్యార్థులు ఐఐటీ సీట్లు సాధించి జిల్లా పేరు గర్వంగా నిలపాలి" అని విద్యార్థులను ఉద్దేశించి ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి నుంచి ఉన్నత విద్యా అవకాశాల వరకు సమగ్ర సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండగగా శ్రీ దత్తాత్రేయ స్వామి రథోత్సవం

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,డిసెంబర్ 03 (ప్రజా జ్యోతి): నారాయణపేట జిల్లా మఖ్తల్ మండలం మంథన్ గోడ్ గ్రామ సమీపంలో పచ్చని పంట పొలాల మధ్య చుట్టూరా గుండ్ల మధ్యలో వెలసిన శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయంలో దత్తాత్రేయ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు కృష్ణ ప్రసాద్ జోషి,టెక్ రాజ్ జోషి తెల్లవారుజామున శ్రీ దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. దత్తాత్రేయ జయంతి సందర్భంగా స్వామివారిని తెల్లవారుజాము నుండి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో శ్రీ దత్తాత్రేయ స్వామి ఉత్సవమూర్తిని పల్లకిలో మేళ తాళాల మధ్య భక్తుల శ్రీ దత్త నామస్మరణలతో రథోత్సవం చుట్టు ప్రదర్శన నిర్వహించి రథంపై ఉత్సవ మూర్తిని ఉంచి అర్చకులు మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం శ్రీ దత్తాత్రేయ స్వామివారి జయంతి వేడుకలకు విచ్చేసిన వందలాది మంది భక్తులు దత్తాత్రేయ నామాలు స్మరిస్తూ, కేరింతలు, భక్తుల పలకల కోలాటాల మధ్య భక్తులు పోటీపడుతూ రథోత్సవాన్ని లాగారు. రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు విచ్చేసిన వందలాది భక్తుల శ్రీ దత్త నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వెంకట్రాములు, కృష్ణయ్య గౌడ్, మనోహర్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



# "హిందువుల సెంటిమెంట్‌ను కించపరిస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదు

**• సీఎం వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలి • బిజెపి నాయకులు**

**పరకాల, డిసెంబర్ 03, (ప్రజాజ్యోతి) :** హిందూ దేవతలను అవమానించే రీతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వెల్లువెత్తుతున్న వేళ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పరకాల పట్టణంలో బీజేపీ నిరసన చేపట్టింది. పట్టణ బీజేపీ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా గుమికూడి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ సిఎం పదవిలో ఉన్న వ్యక్తి ప్రజల భక్తి భావాలను, హిందూ దేవతల గౌరవాన్ని దెబ్బతీయడం అత్యంత దురదృష్టకరమని, ఇది సీఎం బాధ్యతారాహిత్యమైన ప్రవర్తన అని తీవ్రంగా మండిపడ్డారు. హిందూ మతాన్ని అవమానించే వ్యాఖ్యలు చేయడం ఒకవైపు ప్రభుత్వ విధానాలకు, మరోవైపు ప్రజలకు ఇచ్చిన హామీలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. "హిందువుల సెంటిమెంట్‌ను కించపరిచే ఏ ప్రయత్నాన్నైనా బీజేపీ అసలు సహించదు. కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ భావాలను కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం తాకట్టు పెట్టుబోతుందా?" అని ప్రశ్నించారు. రాష్ట్రానికి నాయకత్వం వహించే వ్యక్తి ఇలాంటి వ్యవహారం చేస్తే రాష్ట్రంలో మతసహనం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే బీజేపీ మరింత ఉగ్రరూపంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ నిరసనలో బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి నినాదాలతో పరకాల పట్టణాన్ని మార్మోగించారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శులు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి జిల్లా నాయకులు బెజ్జంకి పూర్ణ చారి, మారేడుగొండ భాస్కరాచారి, కుక్కల విజయ కుమార్, దంచనాదుల సత్యనారాయణ, నాయకులు



పావుశెట్టి శ్రీనివాస్, పైండ్ల రంజిత్, వెనిశెట్టి శారద, కానుగుల గోపీనాథ్, కోడల లింగమూర్తి ఆకుల రాజేందర్, సోమరాజ్, బూత్ అధ్యక్షులు సారంగ నరేష్, ముత్యాల దేవేందర్, సంఘ నరేష్, కాగితపు చంద్రమోహన్, పెండెల రామకృష్ణ, మరియు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా హాస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



**బిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు**

**నర్సంపేట డిసెంబర్ 3 (ప్రజాజ్యోతి) :** నర్సంపేట ప్రభుత్వ జిల్లా హాస్పటల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల కు గత ఆరు నెలల నుండి రావలసిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని బిఆర్టియు జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రి మెడికల్ కాలేజ్ ప్రసూతి హాస్పిటల్ లో శానిటేషన్, పేషంట్ కేర్ ,సెక్యూరిటీ, సూపర్వైజర్స్ విభాగాలలో సుమారు 40 మంది కార్మికులు కాంటాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని వీరికి గత ఆరు నెలల నుండి వేతనాలు లేవని నెల అంతా పనిచేసి నెల గడవగానే జీతం లేకుంటే వారి కుటుంబాలు ఇలా జీవనం కొనసాగుతాయో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. పెండింగ్ వేతనాలపై గతంలో జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ దృష్టికి కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ప్రభుత్వ నుండి డబ్బులు రావాల్సి ఉంది రాలేదు మేము ఏం చేయాలని సమాధానం చెబుతున్నారు తప్ప సమస్యను పట్టించుకోని పరిష్కారం చేసే నాధుడే కరువయ్యారని వాపోయారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మాట తప్పి ఆరు నెలలు గడిచిన జీతాలు రావడంలేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ప్రభుత్వ వైద్య ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వేతనాలు ఇవ్వకుంటే భవిష్యత్తులో దఫలవారీగా పోరాటం చేస్తామని అయినా స్పందించకపోతే నిరవధిక సమ్మె కూడా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ప్రదీప్ కుమార్ కార్యదర్శి సుమన్ ఉపాధ్యక్షులు వంశీకృష్ణ కోశాధికారి కే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 228 కోట్ల రూపాయలతో అభివృద్ధికి శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**నర్సంపేట డిసెంబర్ 3 (ప్రజాజ్యోతి) :** ఈనెల 5వ తారీఖున మధ్యాహ్నం ఒకటింటికి నర్సంపేట పట్టణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి నేతృత్వంలో నర్సంపేట పట్టణము నియోజకవర్గంలోని అనేక అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 228 కోట్లతో రోడ్ల అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ స్కూల్200 కోట్లతో, 150 కోట్లతో మెడికల్ కాలేజ్, 25 కోట్లతో నర్సింగ్ కాలేజ్, 20 కోట్లతో నర్సంపేట పట్టణం మున్సిపాలిటీ విలీన గ్రామాలకు సిసి రోడ్లు డ్రైనేజీలు కల్వర్టులు సెంట్రల్ లైటింగ్,నర్సంపేట పోలీస్ స్టేషన్ నుండి నాగుర్ల పల్లె మాదన్నపేట వరకు సెంట్రల్ లైటింగ్ డబుల్ రోడ్డు సిసి, నర్సంపేట నుండి మొద్దుం పురం రాజ పల్లె వరకు డబుల్ రోడ్డు సెంట్రల్ లైటింగ్, మహేశ్వరం లోపలికి సెంట్రల్ లైటింగ్ డబుల్ రోడ్డుతో పాటు మరో 400 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. వరంగల్ నుండి నర్సంపేటకు వచ్చే ప్రధాన రహదారి ధర్మారం నుండినర్సంపేట వరకు 83 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం జీవో నెంబర్ 280 ధర్మారం, గీసుకొండ, ఊకల్లు క్రాస్ రోడ్, మచ్చాపూర్, కొమ్మాల, గిర్నిబావి, లగ్న పెల్లి, మహేశ్వరం నుండి నర్సంపేట వరకు నాలుగు లైన్ల రోడ్డు 83 కోట్ల రూపాయల తోని నిర్మించడానికి శంకుస్థాపన. నర్సంపేట నుండి పాకాల వరకు 10 కిలోమీటర్లు డబుల్ రోడ్డు 17 కోట్ల 28 లక్షలతో రోడ్డు నిర్మాణం జీవో నెంబర్ 281 నర్సంపేట అయోధ్య నగర్ అశోక్ నగర్ పాకాల వరకు. నెక్కొండ కే సముద్రం.12.10 కిలోమీటర్లు 38 కోట్ల 74 లక్షలతో డబుల్ రోడ్డు నిర్మాణం జీవో నెంబర్ 283. నెక్కొండ అప్పలరావు పేట వెంకటాపురం తోపనపల్లి అలంకానిపేట కేసముద్రం వరకు. నర్సంపేట నుండి నెక్కొండ వరకు 18.47 కిలోమీటర్లు రూ:56 కోట్ల 40 లక్షలతో డబుల్ రోడ్డు నిర్మాణం జీవో నెంబర్ 284 నర్సంపేట, పాత ముదుంపురం, చెన్నారావుపేట, జల్లి అమీనాబాద్,



పనికిరా, అమీన్ పేట, నెక్కొండ వరకు నెక్కొండ గూడూర్ డబుల్ రోడ్డు పది కిలోమీటర్లు 33 కోట్లుతో డబుల్ రోడ్డు నిర్మాణం జీవో నెంబర్ 367 నెక్కొండ, సూరిపల్లి ,లింగగిరి, గుండెంగా, గూడూరు వరకు. మొత్తం రూపాయలు 228 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన. సభ స్థలాన్నికి సమీపంలో పార్కింగ్ స్థలాలను పరిశీలిస్తున్న నర్సంపేట సీఐ రఘు నర్సంపేట మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ఎస్సై అరుణ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు వేముల సారంగం గౌడ్ పట్టణ కమిటీ కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల నాయకులు పరిటాల నాగేశ్వరరావు, సభ్యులు తాళ్ల పెల్లి, శ్రీనివాస్ గౌడ్, దండెం రతన్ కుమార్, కోయడి కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు ఎన్ని అడ్డంకులు ఉన్నా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి




**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్**

**భూపాలపల్లి టౌన్, ప్రజాజ్యోతి డిసెంబర్ 3 :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ సివిల్, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ అఖిల, ఎస్పి సంకీర్త్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని రకాల సహకారాలు అందిస్తోందని తెలిపారు. సదరం సర్టిఫికెట్లు జారీతో పాటు 'భవిత' కేంద్రాల ద్వారా విద్యా నైపుణ్యాభివృద్ధికి.కృషి చేస్తున్నామని అన్నారు. ఇటీవల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో దివ్యాంగులు అద్భుత ప్రతిభ కనబరిచారని ప్రశంసిస్తూ, శాఖల ద్వారా అందుతున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు.

మీ అభివృద్ధి అంటే సమాజ అభివృద్ధి అని, జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. తదుపరి న్యాయ సహకార సంస్థ ఛైర్మన్ అఖిల మాట్లాడుతూ వైకల్యం ఉన్న అనేక మంది దివ్యాంగులు చిత్రకళ, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలుస్తున్నారు. దివ్యాంగుల హక్కులకు సంబంధించి కోర్టుకు వచ్చే దివ్యాంగులకు న్యాయవాదిని ఏర్పాటు చేసి పూర్తి న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. నేను చేయలేను అనే భావనను వదిలి, పాజిటివ్ ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ దివ్యాంగులు డిజేబుల్ కాదని డిపెండబుల్ అన్నారు. దివ్యాంగులకు ప్రతిబంధకాలు విజయానికి అడ్డంకులు కావని, టాలెంట్ విషయంలో దివ్యాంగులు ఇతరులకంటే ఏమాత్రం తీసిపోరని తెలిపారు. లోపాలను గుర్తుచేసుకుంటూ ఆగకుండ, అవకాశాలను



వినియోగించుకుంటూ ముందుకు సాగాలన్నారు. దివ్యాంగులలో అసాధ్యాన్ని సాధించే శక్తి ఉందని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మీకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మహిళా సంక్షేమ అధికారి మల్లేశ్వరి, డీఈఓ రాజేందర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డీఆర్డిఓ బాలకృష్ణ, మెప్మా డీ.ఎం.సి వేములవాడ రాజేశ్వరి, హెచ్ఎమ్ఆర్టీ సంస్థ అధ్యక్షురాలు కే. రజిత, ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ అధ్యక్షులు అయిలి మారుతి, పారా ఒలంపిక్స్ జిల్లా అధ్యక్షులు కుమార్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం




**హనుమకొండ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 03, (ప్రజాజ్యోతి) :** అంబేద్కర్ భవన్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ దివ్యాంగుల ఆత్మవిశ్వాసాన్ని అభినందిస్తూ, సమాజంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు, ఉపాధిలో ప్రత్యేక కోటా వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ భవన్, కలెక్టరేట్‌లో ర్యాంపు సౌకర్యాలు తక్షణం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, పలువురు అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలలో భార్య గెలుపు కోసం కన్నీటితో వేడుకున్న భర్త గారె భిక్షపతి

**రాయపర్తి డిసెంబర్ 3 ప్రజాజ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం రాయపర్తి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిని గా బరిలో గారే సహేంద్ర ఉన్నారు ఈ సందర్భంగా ఆమె భర్త గారె భిక్షపతి గతంలో తాను సర్పంచ్ గా ఎంపీటీసీగా ఓడిపోయానని ఈ సారి తన భార్యను అత్యధిక మెజార్టీతో ప్రజలుగెలిపించాలని గ్రామస్తులను కన్నీళ్లతో వేడుకున్న సంఘటన రాయపర్తి మండలంలో చోటుచేసు కున్నది. అభ్యర్థి సహేంద్ర కూడా భావోద్వేగానికి గురయ్యారు. భిక్షపతి వేడుకోలు చూసి ఆయన అనుచరులు కూడా చలించిపోయారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అయిన తనకు కాకుండా వేరే వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వడంతో ఇండిపెండెంట్గా సర్పంచ్ బరిలో ఉనాన్నని ఆయన తెలిపారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే మండలకు కేంద్రమైన రాయపర్తిని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన చెప్పారు. సందర్భంగా ఆయన వెంట ఆయన కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కొండూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

**– కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్‌లో చేరికలు**





**రాయపర్తి డిసెంబర్ 3 ప్రజాజ్యోతి :** రాయపర్తి మండలం కొండూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ చిర్ర. ఉపేంద్ర ఆవుల కేశవరెడ్డి పిఏసిఎస్ డైరెక్టర్ కర్ర. ప్రవీణ్ రెడ్డి మాజీ వార్డ్ మెంబర్ వడ్డెర సంఘం ముఖ్య నేత రాపోలు శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు యూత్ నాయకులు ఉన్నారు.

# దామెర గ్రామ రాజకీయాల్లో పెద్ద మార్పు

**– కాంగ్రెస్ మాజీ గ్రామ అధ్యక్షుడు సాతూరి ప్రభాకర్ బీజేపీలో చేరిక**





**ఎల్కతుర్తి డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గ్రామ రాజకీయాల్లో కీలక మలుపు తిరిగింది దామెర గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సాతూరి ప్రభాకర్ కేంద్ర అధికార పార్టీ బిజెపిలో చేరడం ద్వారా స్థానిక రాజకీయాల్లో చర్చ నియాంశంగా మారింది. బిజెపి మండల అధ్యక్షుడు మన్నూర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి సాతూరి ప్రభాకర్‌ను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ అభివృద్ధికి బిజెపి చేస్తున్న కృషి కేంద్రం తీసుకుంటున్న ప్రజా ప్రయోజన కార్యక్రమాలు ఆకట్టుకోవడం వల్లే పార్టీలో చేరానని ప్రభాకర్ ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిజెపి బలపడేందుకు సాతూరి ప్రభాకర్ చేరిక కీలకంగా మారుతుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. దామెర గ్రామంలో బిజెపి శక్తి విస్తరణకు ఇది పెద్ద సంఘటనగా నాయకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దామెర శక్తి కేంద్ర ఇన్చార్జి ఠాకూర్ శ్యామ్ సింగ్, మాజీ సర్పంచ్ చల్ల రవీందర్ రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు అంబీర్ శ్రీనివాస్, పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లు నిర్వహించాలి

**– నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**





**దామెర, డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామినేషన్ల ప్రక్రియను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం పరిశీలించారు. హనుమకొండ జిల్లాలో మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన దామెర క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో దామెర, ల్యాదెళ్ళ గ్రామ పంచాయతీలకు, ఒగ్లాపూర్ క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఒగ్లాపూర్, దమ్మన్నపేట గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరిస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఉన్న ఎలక్షన్ నోటీస్, రిజర్వేషన్ల జాబితాలను పరిశీలించారు. ఆర్వోలు, ఏఆర్వోలతో నామినేషన్ల ప్రక్రియ గురించి కలెక్టర్ మాట్లాడి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఏర్పాట్లను, నామినేషన్ల ప్రక్రియను ఎంపీడీవో కల్పన జిల్లా కలెక్టర్ కు వివరించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది, పోలీస్ భద్రత గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కటాక్షపూర్ సర్పంచ్ అభ్యర్థిగా 'ఎండి షబానా గఫూర్' నామినేషన్ దాఖలు



**ఆత్మకూరు, డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి):** ఆత్మకూరు మండలం కటాక్షపూర్ సర్పంచ్ అభ్యర్తిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎండి షబానా గఫూర్ నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ గ్రామంలో పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా ఎండి షబానా గఫూర్ నామినేషన్ సమర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్ సమక్షంలో సర్పంచ్ గా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా షబానా మాట్లాడుతూ.. కటాక్షపూర్ గ్రామ ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించగలరని కోరుచున్నాము. గ్రామానికి సేవ చేసేందుకు ముందుకు వస్తున్నట్టు పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన 'సెయింట్ థెరిస్సా' విద్యార్థి



**ఆత్మకూర్, డిసెంబర్ 03, (ప్రజాజ్యోతి) :** రాష్ట్రస్థాయిలో అండర్ 14 క్రికెట్ పోటీలకు ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా పాఠశాల నుండి 8వ తరగతి చదువుతున్న వేల్పుల లెనిన్ తేజ ఎంపికయ్యారు. బుధవారం విద్యార్థిని సన్మానించి పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జాయిస్ వివరాలు మీడియా కు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రోస్ మేరీ ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయికి ఎంపికైన లెనిన్ తేజాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సెయింట్ తెరిస్సా పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు ఆటలలో ప్రావీణ్యం పొందేందుకు నిష్ణాతులైన ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లను నియమించామని తద్వారా అన్ని విధములైన ఆటలలో ప్రతిభ కనబరిచే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కూన శ్రీనివాస్ గౌడ్‌ను సన్మానించిన సోదా

**హనుమకొండ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 03, (ప్రజాజ్యోతి) :** హైదరాబాద్ కుత్బులాపూర్ మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ సోదరుడు కూన శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదానికి వెళ్తూ హనుమకొండ ప్రేమ్ నగర్ కాలనీకి వచ్చిన సందర్భంగా వారిని ఆహ్వానించి శాలువాతో సన్మానించిన పరకాల మాజీ మున్సిపల్ చైర్మన్ సోద రామకృష్ణ. వారితోపాటు విచ్చేసిన కుత్బుల్లాపూర్ నియోజక వర్గ సీనియర్ నాయకులు బాలప్ప, చిటికేసి సదాశివుడు పాల్గొన్నారు.



# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



**నడి కూడ డిసెంబర్ 03, (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని నడికూడ, కంటత్మకూర్, కౌకొండ గ్రామాలలో బుధవారం రోజున 3వ విడత సర్పంచ్, వార్డు మెంబర్ నామినేషన్ కేంద్రాల వసతులను పర్యవేక్షించిన అసిస్టెంట్ డిప్యూటీ ఎలక్షన్ అథారిటీ హనుమకొండ జిల్లా జడ్పీ సీఈవో బి.రవి, పరకాల ఆర్డీఓ డాక్టర్. నారాయణ రెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ, తాహసిల్దార్ రాణి, ఎంపీ ఓ మార్గవి రెడ్డి తదితరులు.

## గ్రామ అభివృద్ధికై సర్పంచ్ గా మీ ముందుకు వస్తున్నా.. ఆశీర్వదించండి

### గానుగ బండ గ్రామ సర్పంచ్ అభ్యర్థి పులి సత్తమ్మ

తుంగతుర్తి, డిసెంబర్ 3,(ప్రజా జ్యోతి):
మండల పరిధిలోని గానుగబండ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆశీర్వాదంతో మీ ముందుకు వస్తున్నానని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని పులి సత్తమ్మ కోరారు.



బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాను గెలిస్తే గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుందన్నారు. తాను సర్పంచ్ గా గెలిస్తే స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ సహకారంతో ఊరి అభివృద్ధి కొరకు అధిక నిధులు తీసుకువస్తానని తెలిపారు. గ్రామ సర్పంచ్గా ఒక్కసారి నాకు అవకాశం ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపిస్తే కచ్చితంగా ఊరు అభివృద్ధి ఏంటో తాను చేసి చూపిస్తానని తెలిపారు.

## ఆశీర్వదించి గెలిపించండి.. అభివృద్ధి చేస్తా

### గుమ్మడవెల్లి సర్పంచ్ అభ్యర్థి వరికుప్పల ముత్తమ్మ

**తుంగతుర్తి, డిసెంబర్ 3,(ప్రజా జ్యోతి):**
తనను ఆశీర్వదించి గెలిపించాలని ఓటర్లను వరికుప్పల ముత్తమ్మ అభ్యర్థించారు. మద్దిరాల మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వరికుప్పల ముత్తమ్మ బుధవారం ప్రచారం చేస్తూ విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అండదండలతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం గత ఒక దశాబ్ద







కాలంలో తుంగతుర్తి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే నన్ను ఈ గ్రామ సర్పంచిగా గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధికి నిలువుటద్దంగా నాటి బిఆర్ఎస్ పాలన, కిషోర్ కుమార్ సారధ్యంలో పరుగు పెట్టిన ప్రగతినీ చూసి నన్ను ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామ నాయకుల సహకారంతో మన గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గాదుదల లింగయ్య, లింగరాజు, మురళి, శ్రీను, మహేష్, యాకయ్య, రమేష్, ఉప్పలయ్య, రవి, జగదీష్ అంజలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగ శీలి.. అమరుడు శ్రీకాంతాచారి

**తుంగతుర్తి, డిసెంబర్ 3,(ప్రజా జ్యోతి):**
తెలంగాణ రాష్ట్ర మలి దశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి గొప్ప యోధుడు అని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య



అన్నారు. అమరుడు శ్రీకాంత్ చారి వర్ధంతి సందర్భంగా బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి మాజీ ఎంపీపీ గుండ గాని కవితా రాములు గౌడ్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సూర్య చంద్రులు ఉన్నంత వరకు శ్రీకాంతాచారి త్యాగం గుర్తు ఉంటుందని అన్నారు..ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు జిల్లా నాయకులు గుండగాని దుర్గయ్య, గుండగాని వీరయ్య,పోలేపాక సోమయ్య,కట్ల చంద్రయ్య, పోలేపాక పరమేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ఐక్యత ఫలితం - ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకోబడిన దాసరి ఎల్లమ్మ

**తుంగతుర్తి, డిసెంబర్ 3,(ప్రజా జ్యోతి):**



తుంగతుర్తి మండలం పరిధిలోని తూర్పు గూడెం గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విశేష పరిణామం చోటుచేసుకుంది. గ్రామ ప్రజలు రాజకీయ భేదాలను పక్కనబెట్టి, గ్రామాభివృద్ధి, శాంతి, ఐక్యతను లక్ష్యంగా పెట్టుకొని దాసరి ఎల్లమ్మను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ అభ్యర్థులుగా వివిధ పార్టీల నుంచి బరిలో నిలిచిన ఇద్దరు అభ్యర్థులు ఉపసంహరించుకోవడంతో ఎల్లమ్మ ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామ పెద్దలు,ఇరు పార్టీ నాయకులు పాల్గొన్న సమావేశంలో ఎల్లమ్మ పేరు ఖరారు చేయటంతో గ్రామంలో సంతోష వాతావరణం నెలకొంది.ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ దాసరి ఎల్లమ్మ మాట్లాడుతూ.. గ్రామం నాపై ఉంచిన నమ్మకాన్ని గౌరవంగా భావిస్తున్నానన్నారు.నా పదవి సేవ కోసం,అభివృద్ధి బాధ్యతగా చూస్తాననీ,గ్రామం అభివృద్ధికి నిబద్ధంగా పనిచేస్తాననీ తెలిపారు. అదేవిధంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ...దాసరి ఎల్లమ్మ ఏకగ్రీవ ఎన్నిక గ్రామ ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలిచిందన్నారు.గ్రామ అభివృద్ధి దిశగా ఈ నిర్ణయం మైలురాయిగా మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా కాసోజు శ్రీకాంత చారి వర్ధంతి

### అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భువనగిరి,డిసెంబర్ (3ప్రజాజ్యోతి)**
తెలంగాణ ఓయూ క్యాంపస్ విద్యార్థి కాసోజు శ్రీకాంత చారి వర్ధంతి సందర్భంగా భువనగిరి పట్టణం లోని





అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన భువనగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరనరాన తెలంగాణం.ఈ దేహం తెలంగాణ తల్లికి అంకితమంటూ. ప్రత్యేక రాష్ట్ర సాధనకై,తృణప్రాయంగా తన ప్రాణాలను అర్పించిన అమరు వీరుడు.కాసోజు శ్రీకాంతా చారి వర్ధంతి నేడు.13 ఏళ్ల క్రితం ఆయన,చేసిన ఆత్మార్పణ దృశ్యాలు నేటికీ తెలంగాణ ప్రజల గుండెల్లో జై తెలంగాణ,నినాదాన్ని రగిలిస్తూనే ఉంటాయని అన్నారు.అదే విధంగా నేడు తెలంగాణ అమర, వీరుడుకాసోజు శ్రీకాంతా చారి వర్ధంతి మలిదశ ఉద్యమంలో అత్మార్పణ చేసుకున్న తెలంగాణ పుత్రుడు ఆత్మాహుతిలో తుది శ్వాస విడిచి నేటికి,12 సంవత్స రాలు. సరిగ్గా13 సంవత్సరాల క్రితం తెలంగాణ మలిదశ ఉద్యమం ఒక్కసారిగా ఉవ్వెత్తునా ఎగిసిందని ప్రతీ ఒక్కరి,మనసులో తెలంగాణ ఉద్యమ జ్వాల రగిలిందని ఉద్యమాన్ని ఎవ్వరు మర్చిపోలేదని అన్నారు. ఈరోజు ప్రత్యేక తెలంగాణ సాధ్యమైందంటే,ఆ రోజు జరిగిన సంఘటనే.ఇందుకు కారణమని చెప్పటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అదే తెలంగాణ అమర వీరుడు కాసోజు శ్రీకాంతా చారి అత్మార్పణం. తాను అగ్ని ఆహుతి అవుతూ.. జై తెలంగాణ నినాదంతో ప్రతీ ఒక్కరిలో ఉద్యమ జ్వాలను రగిలించి.. ప్రత్యేక రాష్ట్ర పోరాటాన్ని ఆకాశానికి చేర్చిన తెలంగాణ పుత్రుడు వీరమరణం పొందిన రోజు నేడు. ఈ రోజు శ్రీకాంత చారి వర్ధంతి సందర్భంగా.ఆ అమర వీరుడి త్యాగాన్ని తెలంగాణ సమాజం స్మరించుకుంటోందని అన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపాలిటీ చైర్మన్ పోతంశెట్టి వెంకటేష్వర్లు గ్రంధాలయం చైర్మన్ అవేస్ చిస్తీ, టీపీసిసి కార్యదర్శి తంగెళ్ల పల్లి రవికుమార్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, మార్కెట్ కమెటీ చైర్మన్ రేఖ బాబు రావు.జిల్లా నాయకులు ఎండీ మజహార్ యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బర్రె నరేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు

### చూపు లేకున్నా.... శరీరం సహకరించకున్న వైకల్యమే విజయం

**నాంపల్లి,డిసెంబర్,03(ప్రజా జ్యోతి):**
అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వేడుకలు పురస్కరించుకుని బుధవారం నాంపల్లి మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో భవితా కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి కె.మల్లికార్జున రావు హాజరై మాట్లాడారు. దివ్యాంగులు, వికలాంగులు ప్రభుత్వం కల్పించే సంక్షేమ కార్యక్రమాలను అందిపుచ్చుకుంటూ, భవిత కేంద్రంలో పనిచేసే ఉపాధ్యాయుల సేవలు ఉపయోగించుకోవాలని తెలిపారు. మీ దివ్యాంగ పిల్లలను విజ్ఞానవంతులుగా తీర్చి తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు కూడా పిల్లలకు మంచి సహకారాన్ని, సేవలను అందించాలి.అదేవిధంగా దివ్యాంగులకు ప్రభుత్వం కల్పించే సంక్షేమ కార్యక్రమాలతో పాటు విద్యా, ఉపాధి, ఉద్యోగాలలో రిజర్వేషన్ ఫలాలు కూడా అందుకోవాలని తెలిపారు. ప్రపంచంలో చాలామంది దివ్యాంగులు కూడా మంచి విజ్ఞానవంతులుగా, శాస్త్రవేత్తలుగా, క్రీడాకారులుగా ఎదిగినారనీ, అద్భుతమైన శక్తికి, అసమానమైన దృఢత్వానికి, సృజనాత్మకతకు నిదర్శనంగా నిలుస్తున్నారు. భౌతిక అడ్డంకులను



ధైర్యంగా అధికమిస్తూ దృఢ సంకల్పానికి ప్రతీకగా కనిపిస్తున్నారు. కళలు, క్రీడలు, సైన్స్ సాంకేతికతతో సహజీవంలోకి ప్రతి రంగంలో వారు సాధిస్తున్న విజయాలు అద్భుత విజయాలు..వారిని స్ఫూర్తిగా తీసుకొని మీ యొక్క పిల్లలు విజ్ఞాన వంతులుగా మారటానికి ప్రయత్నం చేయాలని కోరారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటలు పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు స్నాక్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, ఉపాధ్యాయురాలు కృషవేణి, శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్ స్పెషలెడ్యుకేటర్, భవిత సెంటర్ ఇంచార్జ్ ఎస్ దర్గ, సిఆర్పి కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం వేడుకలు

### - మీరు ఏ విషయంలోనూ తక్కువ కాదు%ొ% అన్ని రంగాల్లో మెరవాలి"- ఎంఈఓ అగ్గిరాములు

**గుండాల, డిసెంబర్ 03 (ప్రజా జ్యోతి):**
ప్రపంచ వికలాంగుల దినోత్సవం



సందర్భంగా గుండాల ఎంపీపీ ఎస్ భవిత సెంటర్‌లో దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మన్నె అగ్గి రాములు మాట్లాడుతూ, "మీరు ఏ విషయంలోనూ తక్కువ కాదు%ొ% పోటీపడి అన్ని రంగాల్లో ముందుండాలి" అని దివ్యాంగ పిల్లలకు ప్రోత్సాహం అందించారు.
అలాగే భవితా సెంటర్‌లో ప్రతి మంగళవారం మరియు శుక్రవారం ఫిజియోథెరపీ డాక్టరు అందుబాటులో ఉంటారని, అన్ని గ్రామాల దివ్యాంగ పిల్లలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిల్లల కోసం వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ



కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొడుగు బాలరాజు, ఎంఎంపీఎస్ గుండాల హెచ్ఎమ్ బి. స్వప్నలత, స్పెషల్ టీచర్ సుచరిత, ఐఈఆర్పి కుందారం సత్యం, సిఆర్పి దేవనబోయిన లింగయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ దేవనబోయిన నరేష్, ఎల్‌డిఎ అనీఫ్, మెసెంజర్ ముత్తయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన గోలి సంతోష్ రెడ్డి

**బీబీనగర్ డిసెంబర్ 03(ప్రజాజ్యోతి న్యూస్):**
బీబీనగర్ మండల కేంద్రంలో బీబీనగర్ బి ఆర్ ఎస్ గ్రామ శాఖ పట్టణ అధ్యక్షులు గోలి సంతోష్ రెడ్డి తో పాటు మరికొందరు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు భువనగిరి ఎమెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమీక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి,మాజి ఎంపిటీసీ గోలి నరేందర్ రెడ్డి, మాజి మండల కోప్షన్ సభ్యులు ఎం. డి అక్బర్, కాంగ్రెస్ నాయకులు పంజాల వెంకటేష్, టంటం జహంగీర్, పంజాల శ్రీనివాస్,పంజాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## పోచంపల్లిలో దివ్యాంగుల దినోత్సవం వేడుకలు

**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి):**
పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో



ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల బతుకమ్మ ఆటతో కార్యక్రమం ప్రారంభమైంది. మండల విద్యాధికారి ప్రభాకర్ ప్రధాన అతిథిగా పాల్గొని, దివ్యాంగుల పిల్లలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహ, శ్రీదేవి, స్పెషల్ ఎడ్యుకేటర్లు శ్రీనివాస్, కృష్ణ, భవిత కేంద్ర నిర్వాహకురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## నూనెగూడెంలో బీఆర్ఎస్ అభ్యర్థి తూనం శివ రాణి నామినేషన్

### - గ్రామాభివృద్ధికి కట్టుబడి పని చేస్తానన్న హామీ

**గుండాల, డిసెంబర్ 03 (ప్రజా జ్యోతి):**
గుండాల మండలం నూనెగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ తరపున సర్పంచ్ అభ్యర్థిగా తూనం శివ రాణి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా శివ రాణి మాట్లాడుతూ "సర్పంచ్‌గా ఒకసారి అవకాశం ఇవ్వండి%ొ% నూనెగూడెం గ్రామాన్ని అభివృద్ధి దిశగా



ముందుకు తీసుకెళ్లడం నా ముఖ్య ధ్యేయం. ప్రజల కష్ట%–%సుఖాల్లో నేను మీతోనే ఉంటాను. నా గెలుపుకు గ్రామ ప్రజలందరూ ఆశీర్వాదం అందించాలని కోరుకుంటున్నాను" అని ప్రకటించారు.కార్యక్రమంలో కారుపోతుల ఐలయ్య, ఆలేటి మల్లారెడ్డి, వంగరాజు, అన్వర్, బుషిగంపల పరుశరాములు, మలిపెద్ది లక్ష్మారెడ్డి, ఓర్సు సుధాకర్, కప్పరి రాజశేఖర్ రెడ్డి, గన్న మాధవరెడ్డి, నరేష్, జిట్ట మల్లేష్, తూనం సతీష్, తూనం సైదులు, గన్న సత్తిరెడ్డి, బొంత అనిల్, బండి ఎల్లయ్య, ఎండి రహీమత్, వంగ భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవ కోసం ముందుకు వస్తున్న

### సర్పంచ్ అభ్యర్థిగా ఆశీర్వాదాలు కోరిన తప్పట్ల ఎల్లయ్య

**తుంగతుర్తి, డిసెంబర్ 3,(ప్రజా జ్యోతి):**



ప్రజా సేవ ధ్యేయంగా సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నానని తప్పట్ల ఎల్లయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ...వెంపటి గ్రామం పట్ల ప్రేమ, అభివృద్ధి లక్ష్యం, ప్రజల సంక్షేమం ప్రధానంగా భావిస్తున్నా తానొక రాజకీయ నాయకుడిగా కాదు%ొ% ఈ గ్రామ బిడ్డగా ప్రజల ముందుకు వచ్చానని ఆయన తెలిపారు.పదవి కోసం కాదు, సేవ కోసం ముందుకు వస్తున్నానన్నారు.ఈ గ్రామం నన్ను పెంచింది, బ్రతకడం నేర్పించింది, ముందుకు సాగడం నేర్పించిన నా గ్రామానికి తిరిగి సేవ చేయడానికి సమయం వచ్చిందన్నారు. మీ విశ్వాసం, మీ ఓటు, మీ ఆశీర్వాదం నాకు కావాలి అంటూ తప్పట్ల ఎల్లయ్య భావోద్వేగంగా స్పందించారు. తాను సర్పంచ్ గా గెలిస్తే గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, శుద్ధమైన తాగునీరు, రహదారుల అభివృద్ధి, పేదల సంక్షేమం, రైతులకు సహాయ పథకాలు అమలు చేయడం తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

## చదువులోనే కాదు క్రీడల్లోనే సత్తా చాటుతున్నటైమ్స్ కళాశాల

### రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు టైమ్స్ కళాశాల విద్యార్థి ఎంపిక

**భువనగిరి,డిసెంబర్ 3(ప్రజాజ్యోతి)**
ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో కనగల్ తెలంగాణ,మోడల్ స్కూల్లో అండర్,19 బాల బాలికల ఖో- ఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన భువనగిరి,టైమ్స్ కళాశాలకు చెందిన బోల్లేపల్లి రాఘవేంద్ర (బైపీసీ సెకండియర్)రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు,కళాశాల ఫిజికల్ డైరెక్టర్



పి.అంజయ్య బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 5,6,7 తేదీల్లో సికింద్రాబాద్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో రాఘువేంద్ర పాల్గొంటారని ఆయన అన్నారు.ఈ సందర్భంగా టైమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ బోటనీ వెంకన్న,కరస్పాండెంట్ అవినాష్ కుమార్ రాయ్ మరియు అధ్యాపకులు , ఖో ఖో పోటీలకు రాష్ట్ర స్థాయికి ఎంపికైన రాఘువవేంద్ర ను అభినందించారు.

## దివ్యాంగులకు.. అండగా ఉండాలి

**హాలియా,డిసెంబర్3(ప్రజా జ్యోతి)**
దివ్యాంగులు ప్రతి ఒక్కరూ అండగా ఉంటూ ప్రభుత్వం కల్పించే సంక్షేమ కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలని అనుముల మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి తెలిపారు.బుధవారం హాలియా



పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా జరుపుకు న్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సేవలను ఉపయోగించుకుని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దివ్యాంగులకు సంక్షేమ కార్యక్రమాలతో పాటు, విద్య ఉపాధి అవకాశాల కోసం రిజర్వేషన్ కల్పించబడుతుందని తెలిపారు. ఎంతోమంది విద్యార్థులు జ్ఞానవంతులు, శాస్త్రవేత్తలు క్రీడాకారులు గా ఎదిగారని వారిని పూర్తిగా తీసుకొని మీ పిల్లల భవిష్యత్తుకి పునాది బాటలు వేయాలని కోరారు. దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ అండగా ఉందామని పిలుపునిచ్చారు.దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆటలు ఫోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం. సునీత,రవీందర్,నాగరాజు, నరసింహారెడ్డి, వాణి,మధు, వెంకన్న, గోవిందు,బీమా తదితరులు పాల్గొన్నారు.

# మోర్తాడ్‌లో వికలాంగుల దినోత్సవం



**మోర్తాడ్ డిసెంబర్3(ప్రజా జ్యోతి)** మోర్తాడ్ మండల కేంద్రంలోని భవిత సెంటర్లో ప్రపంచవికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించామని బుధవారం మండల విద్యాశాఖ అధికారి డి సమ్మిరెడ్డితెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి తిరుమల పాల్గొని మాట్లాడారు ఇలాంటి లోపాలు ఉన్న పిల్లలు భవిత సెంటర్ ను ఉపయోగించుకుని ప్రభుత్వం నుండి వచ్చే అన్ని సౌకర్యాలను పొందాలని అలాగే అర్హులైన వారు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు. వివిధ లోపాలున్న పిల్లల తల్లిదండ్రులు ఎలాంటి నిరాశకు గురికావద్దని అన్ని సదుపాయాలు ఉన్న భవిత సెంటర్ ను ఉపయోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఐఈఆర్పిఎన్ ప్రేమస్వరూప ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ డి అఖిల విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతి అంతం, అభివృద్దే నా లక్ష్యం

### – సర్పంచ్ అభ్యర్థి ఆరెపల్లి విజయ దశరథ్





**ఇందల్వాయి డిసెంబర్/ 2 (ప్రజా జ్యోతి న్యూస్)** ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయి గ్రామానికి చెందిన అరపెల్లి విజయ గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలోకి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. సర్పంచ్ అభ్యర్థిగా ఆరెపల్లి విజయ నామినేషన్ మంగళవారం నాడు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఇందల్వాయి నిజమైన అభివృద్ధి కోసం ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. తన విజయం వ్యక్తిగత గెలుపు కాదని,అభివృద్ధికి ప్రజల ఆశయాలకు ప్రతీకగా భావిస్తానని తెలిపారు. ఇందల్వాయిలో ప్రధానంగా పరిష్కారం కావాల్సిన సమస్యలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతానని చెప్పారు. అన్ని కాలనీలలో మౌలిక సౌకర్యాల కల్పన, పరిసరాల శుభ్రత,కాలువల విస్తరణ, రోడ్ మరమ్మతులు, ముంపు నివారణ చర్యలు వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటానని అన్నారు. ప్రజలే తన బలం అని నమ్ముతున్నానని, వారి నమ్మకమే విజయం దిశగా నడిపిస్తుందని ఆరేపల్లి విజయ ఆశాబావాన్ని వ్యక్తపరిచారు. ఎవరి ఒత్తిడులూ, ఎలాంటి రాజకీయ స్వార్థాలూ లేకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఇందల్వాయి గ్రామాభివృద్ధి, ప్రజలకు నిస్వార్థ సేవ అందించడమే తన లక్ష్యమని పునరుద్ఘటించారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోత్కూరు నవీన్ గౌడ్ వీరయ్య. ప్రసాద్ రవి శ్రీను గ్రామ యువనాయకులు మేధావులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలలో పటిష్టమైన బందోబస్తు

### – పోలీస్ కమిషనర్ సాయి చైతన్య




**ఆర్మూర్,డిసెంబర్ 3(ప్రజాజ్యోతి)** ఆర్మూర్ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పరిధిలోని ఆర్మూర్ డివిజన్ పరిధిలో 3వ విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడం జరిగింది.పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్ ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవింద్ పేట్ గ్రామంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షించడం జరిగింది. అక్కడ ఎన్నికల సందర్భంగా తీసుకుంటున్న ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఈ సదర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎటువంటి ఆరోపణలకు, అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అమలు చేస్తు, పోలింగ్ ను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీల వాటి ప్రకారం పటిష్టమైన బందోబస్తులు నిర్వహించడం జరుగుతుందని, పోలీస్ సిబ్బందికి నామినేషన్ సెంటర్ దగ్గరలో 100 మీ.ల లోపు నిషేధిత ఉత్తర్వులు అమలులో ఉంటాయని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, ఎస్.ఎస్.టి మరియు ఎఫ్.ఎస్.టి ల ప్రకారం అన్ని మండలాల యందు పర్యవేక్షించడం జరుతున్నాయని, సమ స్యాత్మకమైనని, అతి సమస్యాత్మకమైనవని ఏర్పాటు చేసి వాటి ప్రకారం బందోబస్తు ఏర్పాట్లు మరియు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రజలందరూ ఎలప్పుడు పోలీసు అధికారులకు సహకరించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్.హెచ్.ఓ సత్యనారాయణ గౌడ్ ఆర్.ఓ డి. సర్సయ్య ఎ.ఆర్.ఓ శ్రీనివాస్ గౌడ్, సెక్రెటరీ సుఖన్య. ప్రిన్సిపాల్ శ్రీమతి ఇందిరా, సిబ్బంది పాల్గొన్నారు.

# తెరపైకి వస్తున్న కొత్త వదనాలు?

**మోర్తాడ్ డిసెంబర్ 3(ప్రజా జ్యోతి)** ఎన్నికల హడావిడి ప్రారంభం అయిన నాటి నుండి ఎలాంటి అలికిడి చూపని కొత్త మొకాలు తెర పైకి వస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు ఎక్కడ చప్పుడు చేయకుండా ఒక్కసారి ప్రచారపర్వం లోకి రావడం తో గ్రామాల్లో వేడి రాజుకుంటోంది. మండల కేంద్రాల్లో ఎక్కువగా కనిపిస్తున్న ఈ అంశం గ్రామీణ ప్రాంతాలలోనూ ప్రారంభం అవుతుంది. డివిజన్ పరిధిలోని అన్ని మండలాలను బుధవారం నామినేషన్ ల పర్వం ప్రారంభం అయింది. తొలి రోజు ఆశించిన స్థాయిలో అభ్యర్థులు నామీనేషన్ లకు ముందుకు రాక పోయినా నామినేషన్ పత్రాల కోసం రావడం కనిపించింది. ఇందులో చాలా మంది కొత్తవారే కనిపించారు. మోర్తాడ్ లాంటి మండల కేంద్రం లోను ఇలాంటి జాబిత ఎక్కువగానె కనిపించడం గమనార్హం. కొందరు నాయకులు కొన్ని తాయిలాలతో రంగ ప్రవేశం చేయడం కనిపించింది. చాలా గ్రామాలలో పాత సర్పంచ్ లు ఎవరు కూడ పోటీ చేస్తున్నట్లు అగపించడం లేదు. ముఖ్యంగా మండల కేంద్రాలలో పార్టీ ల ఆధిపథ్యం ఎక్కువగా కనిపిస్తుంది. కొందరు ఆశావాహులు మండల పదవులపై కన్నెయడంతో సర్పంచ్ ఎన్నికలకు దూరంగానే వుంటున్నారు. తమకు ఆధిపథ్యం వున్న గ్రామాలలో అన్ని పార్టీలు ఇదే పరిస్థితి ఎదురుకుంటున్నాయి. వార్డు సభ్యుల విషయంలో ఈ పరిస్థితి కనిపించక పోయినప్పటికిని సర్పంచ్ పదవుల విషయంలోనే ఇక్కట్లు. ప్రధానంగా గత విడత నిధులు రాక పోవడం, చేసిన పనులకు బిల్లులు రాకపోవడం తదితర పరిస్థితులు గత సర్పంచ్ లు ఎదుర్కొన్న నేపథ్యంలో దానిని బేరీజు వేసుకుంటు ఆలోచన లో పడుతున్నట్టు వినికిడి. అయితే మరో రెండు రోజులు నామినేషన్ వేయడానికి అవకాశం ఉండటంతో, అన్ని పరిస్థితులు గమనిస్తు న్నామని, పత్రాలు తీసుక వెల్లినవారు వారికోసమే తీసుకవెళ్ళారా లేక నిర్నిత అభ్యర్థుల కోసమే ముందస్తుగా తీసుక వెళ్ళారా అన్న విషయం స్పష్టత రావడం లేదు. రెండు రోజుల పాటు పరిస్థితులు గమనించిన తరువాత తిరిగి ముందస్తుగా అనుకున్న వారే పోటీలో ఉంటారన్నా ప్రచారం కూడ వుంది. మొత్తానికి చివరి విడత ఎన్నికల ఘట్టానికి తెర లేవడంతో ఎన్నికల కోలాహలం, జోరు అందుకుంది. విధులు మాత్రం ఊపందుకున్నాయి.

### గాంధారి జూనియర్ కళాశాలలో

## కనీస సౌకర్యాల కోసం ఎబిపిపి నాయకుల వినతి గాంధారి

**డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి)గాంధారి** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎబిపిపి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శేక్ సలాం ను కలిసి సమస్యలను వివరించే వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎబిపిపి నాయకుడు సంజయ్ మాట్లాడుతూ కళాశాలల్లో ప్రాథమిక సదుపాయాల లేమి వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మూత్రశాలల పరిస్థితి దయనీయంగా ఉందని, వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.వినతిపత్రం సమర్పణలో పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కళాశాలలో క్లాస్‌రూమ్‌లు, ప్రాపర్ ల్యాబ్స్, తాగునీటి సౌకర్యం, టాయిలెట్‌లు వంటి అవసరమైన మౌలిక వసతులను అత్యవసరంగా కల్పించాల్సిందిగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.




# విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు








**నిజాంబాద్ రూరల్: డిసెంబర్, 3 (ప్రజా జ్యోతి)** తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా తెలంగాణవిశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఈ యాదగిరి రావు గారు ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు తమ ప్రతిభను మరింతమెరుగుపరుచుకోవాలని సెల్ఫోన్లకు దూరంగా ఉంటూ శారీరక మానసిక శక్తిని పెంచుకోవాలన్నారు విశ్వవిద్యాలయంలో ఉన్న మౌలిక వసతులను ఉపయోగించు కుంటూ విద్యార్థులు తమని తాము నమ్ముకోవాలని ఇతరులను నమ్ముకోకుండా దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ప్రతి ఒక్క విద్యార్థి తమ్మ లక్ష్యాన్ని చేరుకునేలా కష్టపడాలని మరియు ఇలాంటి అపోలకు పోకుండా ఆత్మహత్య లాంటి నిర్ణయాలు తావునివ్వకుండా ధైర్యంగా ముందుకెళ్లాలని సందేశం ఇచ్చారు తెలంగాణ విశ్వవిద్యాలయంలో చేరే నూతన విద్యార్థులకు స్వాగతం పలుకారు ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఎం యాదగిరి ప్రసంగిస్తూ విద్యార్థుల లక్ష్యాన్ని ఏర్పరచుకొని నడవాలని నడవాలని లక్ష్య సాధనలో నిర్లక్ష్యం నిర్వహించద్దని కళాశాల వాతావరణంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు తెలంగాణ వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా " ప్రవీణ్ మామిడాల కార్యక్రమానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు విద్యా సామాజిక సేవా రంగంలో చైతన్యవంతులుగా ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా " లక్ష్మణ్ చక్రవర్తి ఈ కార్యక్రమం ముగింపు కృతజ్ఞతలు పలికారు మరియు కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంట చంద్రశేఖర్. కే సంపత్ కుమార్. రవీందర్ రెడ్డి. లావణ్య. నాగరాజు పాత. జమీల్ అహ్మద్. అబ్దుల్ కవి. బాలకిషన్. అన్ని విభాగాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విస్తృత తనిఖీలు చేపట్టిన సీఐ వినోద్ రెడ్డి



**ఇందల్వాయి, డిసెంబర్ 02,( ప్రజా జ్యోతి న్యూస్ ):** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా విస్తృత తనిఖీలు చేపట్టిన సిఐ వినోద్ రెడ్డి ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ దగ్గర ఎస్.ఎస్.టి టీం విస్తృత తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా సీ. ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో వుంది కావున ప్రయాణికులు చేసేవారు ఎవరైనా 50.000/-రూపాయల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లరాదని అయన తెలిపారు. బంగారం తీసుకెళ్లినా సరైన పత్రాలు వెంబడే తెచ్చుకోవాలని తెలిపారు.లేని యెడల అటువంటి నగదు బంగారం సీజ్ చేస్తామని తెలిపారు.

### ధర్మోరా గ్రామసర్పంచ్ అభ్యర్థిగా

## నామినేషన్ దాఖలు చేసిన ముత్యాల శ్రీనివాస్



**మోర్తాడ్ డిసెంబర్ 3( ప్రజా జ్యోతి)** మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కుందేటి ముత్యాల శ్రీనివాస్ బుధవారం దొనకల్ గ్రామపంచాయతిలో నామినేషన్ దాఖలు చేశారు అనంతరం సర్పంచ్ అభ్యర్థి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకొని గ్రామ అభివృద్ధికి కట్టుబడి గా పని చేస్తానని అన్నారు. మి ఇంటి ఆడబిడ్డక వస్తున్నానని నాపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను.

# పోతంగల్ కలాన్‌లో ఎరువులు

### – విత్తనాల దుకాణాలపై తనిఖీలు

**గాంధారి, డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి)** గాంధారి మండలంలోని పోతంగల్ కలాన్‌లో బుధవారం ఎరువులు, విత్తనాల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, విత్తనాల నిల్వలను పరిశీలించినట్లు వ్యవసాయ అధికారి రాజలింగం తెలిపారు.తనిఖీలలో భాగంగా పోతంగల్ కలాన్‌లోని ధాన్యం సేకరణ కేంద్రాన్ని, గాంధారి మండల కేంద్రంలోని మొక్కజొన్న సేకరణ కేంద్రాన్ని అధికారులు సందర్శించారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తూ, 14 శాతం కంటే తక్కువ తేమ ఉండేలా ధాన్యం ఆరబెట్టాలని







రైతులకు సూచించారు.అధికారులు తెలిపారు ,, ఎకరాకు 25 క్వింటాళ్ల మొక్కజొన్న మాత్రమే సేకరణకు అర్హత కల్గుతుందని. తనిఖీలలో క్లస్టర్ ఏఈఓ నిఖిత, రైతులు, పీఏసీఎస్ మరియు ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

### జగదాంబ తండా సర్పంచ్

# అభ్యర్థిగా బాణావత్ లక్ష్మి నామినేషన్



**నిజామాబాద్ రూరల్: డిసెంబర్, 3 (ప్రజా జ్యోతి)** సిరికొండ మండలం జగదాంబ తండాలో పంచాయతీ ఎన్నికల వేళ మంగళవారం సాయంత్రం సందడి మరింతగా పెరిగింది. సర్పంచ్ పదవికి బాణావతి లక్ష్మి ఘనంగా నామినేషన్ దాఖలు చేయడం గ్రామ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కార్యాలయ ప్రాంగణం ఆమె అనుచరులతో రద్దీగా మారి చిన్న పండువాతావరణాన్ని తలపించింది.నామినేషన్ అనంతరం ఓటర్లతో మాట్లాడిన బాణావతి లక్ష్మి భావోద్వేగంగా స్పందిస్తూ, “జగదాంబ తండా అభివృద్ధి నా లక్ష్యం కాదు%?% నా బాధ్యత. గ్రామం ప్రతి ఇంటిలో వెలుగు రావాలి, ప్రతి కుటుంబం అభివృద్ధి సాధించాలి. నన్ను ఒకసారి సర్పంచ్‌గా అవకాశం ఇవ్వండి. మీ ఓటు విలువైనది. మీ ఆశలను నెరవేర్చే బాధ్యత నాదే” అని తెలిపారు.ఆమె ప్రధాన ప్రాధాన్యతలు ఇలా వివరించారు:తండాలో శుద్ధి తాగునీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారంరోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థబలోపేతంఆశావర్కర్ల, మహిళా సంఘాల, రైతు బృందాల కోసం ప్రత్యేక సహాయ చర్యలుయువతకు క్రీడా అవకాశాలు, ఆత్మకల్పన కేంద్రాలుతండాలో ఆరోగ్యం%-%విద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలునామినేషన్ కార్యక్రమానికి ఆమె భర్త బాణావత్ గోవింద్, కుమారుడు బాణావత్ జేత్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై మద్దతు తెలుపడం గమనార్హం. ప్రజలు ఆమెను చుట్టుముట్టి అభినందనలు తెలియజేయగా, కొందరు పెద్దలు “లక్ష్మి నాయకత్వం గ్రామానికి కొత్త దిశ చూపుతుంది” అని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో భర్త బాణావత్ గోవింద్ కుమారుడు జేత్ తదితరులు ఉన్నారు. ఈ నామినేషన్‌తో జగదాంబ తండా సర్పంచ్ రేసులో కొత్త వేడి నెలకొంది. బాణావతి లక్ష్మి ప్రవేశం స్థానిక రాజకీయ సమీకరణాలను ఆసక్తికరంగా మార్చిందని గ్రామ ప్రజలు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ప్రచారం వేగం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

### సకాలములో గుండె ఆపరేషన్

# నిమిత్తమై ఓ పాజిటివ్ రక్తం అందజేత

- రక్తదానంతో ఆదర్శంగా నిలుస్తున్న చంద్రశేఖర్ రెడ్డి
- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు



**కామారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 3. (ప్రజాజ్యోతి)** గుండె ఆపరేషన్ నిమిత్తమై హైదరాబాదు లోని ప్రైవేటు వైద్యశాలలో షేక్ మజార్ఉద్దీన్ (70) వృద్ధునికి అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో రక్తదాత చంద్రశేఖర్ రెడ్డి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలవడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది సకాలంలో రక్తం అందక తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని,వారి ప్రాణాలను కాపాడడానికి రక్తదాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు,సకాలంలో రక్తం అందనట్లయితే ఎంతో విలువైన ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందని అన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన రక్తదాత చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్కు

# చిన్న మల్లారెడ్డి ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ ఎంపిక

**కామారెడ్డి రూరల్ 03 ప్రజా జ్యోతి** భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సైన్స్ మహోత్సవం ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ కు చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ ఎంపికయ్యారు.పంజాబ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో విజ్ఞానం ద్వారా స్వావలంబన , సమృద్ధి భారత నిర్మాణం ప్రధాన ధ్యేయంగా హర్యానా ప్రభుత్వం సహకారంతో భారత ప్రభుత్వం లోని అనేక సైన్స్ శాఖలు కలిసిఈనెల 6వ తారీకు నుండి 9వ తారీఖు వరకు వరకు చండీగఢ్ రాష్ట్రంలోని పంజాబ్ యూనివర్సిటీ పంచకుల లో జరగనుంది. ఇందులో భాగంగా జరిగే సైన్స్ సఫారీ మరియు గురుకుల కార్యశాలలకు ప్రవీణ్ కుమార్ ఎంపిక కావడం చాలా సంతోషమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ కే సాయిరెడ్డి మండల విద్యాధికారి ఎల్లయ్య గారు తెలిపారు. కృత్యాధార మరియు ప్రయోగాల ద్వారా నో కాస్ట్ మరియు లో కాస్ట్ ద్వారా అభ్యసన సామాగ్రి తయారీ చేయడమే కాకుండా, డిజిటల్ విధానంలో విద్యాబోధన చేస్తూ విద్యార్థులను సైన్స్ ఫెయిర్, ఇన్స్పైర్, ఆస్టరాయిడ్ సర్చ్ క్యాంపేయన్ , బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమాలు,NCC విభాగంలో విద్యార్థులను జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో అన్ని రంగాలలో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నందుకు అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఈ నాలుగు రోజులపాటు జరిగే ఈ కార్యశాలలో విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన ఎన్నో అంశాలను ఇంకా లోతుగా తెలుసుకునుటకు మరియు దేశవ్యాప్తంగా వచ్చే వివిధ ప్రముఖుల ప్రదర్శనలు తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలియజేశారు. ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కే సాయి రెడ్డి గారు మరియు ఉపాధ్యాయ బృందం సంతోషాన్ని వ్యక్తపరిచారు.



# శోభాయమానంగా శివపార్వతీ కల్యాణం





సిద్దిపేట, డిసెంబర్ 03,(ప్రజా జ్యోతి) : వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శివపార్వతుల వివాహాన్ని కన్నులపండుగగా సిద్దిపేటలో నిర్వహించారు. లాల్‌కమాన్ వైశ్య ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం శివ%–%పార్వతీ కల్యాణోత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సంతోష్ మాత గుడి నుంచి ప్రారంభమైన ఉత్సవమూర్తుల ఊరేగింపు సుభాష్ రోడ్, మార్కెట్ చౌరస్తా, లాల్‌కమాన్ మీదుగా సాగి సుందర సత్సంగం భవనం చేరింది. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలతో దేవదంపతులకు ఘన స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొని శివనామస్మరణతో వీధులు మార్మోగించారు. సుందర సత్సంగం భవనంలో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. పార్వతీ మాతకు మహిళలు ఓడుబియ్యం పోసి సంప్రదాయ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో లాల్‌కమాన్ వైశ్య ఫ్యామిలీ క్లబ్ ప్రతినిధులు అయిత నాగరాజు, తెరాల శ్రీనివాస్, సంతోష్, చింత రాము, బెజగామ ఆత్మరాములు, పారిపల్లి శివచరణ్, జూలూరి జగదీశ్వర్, అన్నపూర్ణ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# "రవీంద్ర"లో ఫుడ్‌ఫెస్టివల్

– విద్యతో పాటువిజ్ఞానాన్ని పెంచుకోవాలి – మండల విద్యాధికారి రాజ ప్రభాకర్ రెడ్డి






సిద్దిపేట, డిసెంబర్ 03(ప్రజాజ్యోతి):- జిల్లా కేంద్రంలోని రవీంద్ర స్కూల్‌లో బుధవారం నాడు ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. ఘుమఘుమలాడే, అమోఘమైన ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నాయంటూ ఆహుతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యార్థికారి రాజ ప్రభాకర్ రెడ్డిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా విజ్ఞానాన్ని పెంపొందించుకుని కన్నవారికి, పాఠశాలకు గౌరవాన్ని తీసుకురావాలన్నారు. సిద్దిపేట అర్బన్ మండల విద్యాధికారి రాజ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రస్తుత రోజుల్లో పాఠశాలల్లో విద్యతో పాటు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు పోషక పదార్థాల గురించి, ఆరోగ్యం గురించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఇప్పలపల్లి హరికిషన్ మాట్లాడుతూ దాదాపుగా 100 రకాల ఆహార పదార్థాలను విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్ లో ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కవిత, హేమలత, రేఖ, రజిత, రేవతి విద్యార్థులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ అందుకున్న థామస్



విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖ విద్యావేత్త సిద్దిపేట గాయత్రి హైస్కూల్ ప్రిన్సిపల్ థామస్ కి మణిపూర్ కి చెందిన ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ డాక్టరేట్ తో సత్కరించింది. దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధ విద్యాసంస్థల్లో గత మూడు దశాబ్దాలుగా విద్యాబోధన రంగంలో ప్రతిష్టాత్మక సేవలు అందిస్తూ, అనేకమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో థామస్ సేవలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా విద్యా సంస్థల యజమానులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, శిష్యులు థామస్ ని ఘనంగా అభినందించారు.

సిద్దిపేట రూరల్, డిసెంబర్ 03, (ప్రజా జ్యోతి) : పేద, ప్రతిభావంతుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో

# ట్రెస్మా నూతన అధ్యక్షుడిగా ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి





సిద్దిపేట,డిసెంబర్ 03(ప్రజాజ్యోతి): తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రెస్మా) సిద్దిపేట జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నాడు జిల్లా సర్వసభ్య సమావేశం సిద్దిపేటలో జరిగింది. ఈ కార్యక్రమానికి ట్రెస్మా తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, స్టేట్ ట్రెజరర్ పటోళ్ల రాఘవేందర్ రెడ్డి, ఎలక్షన్ కమిషన్ ఆఫీసర్ కొమురయ్యలు హాజరయ్యారు. అధ్యక్షుడుగా ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా గోపు ఇన్నారెడ్డి, కోశాధికారిగా తపుట రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కదిరే రవి, జిల్లా స్పోక్స్ పర్సన్‌గా రేపాక భాస్కర్ రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కమిటీ, సిద్దిపేట జిల్లాలో గల అన్ని మండలాల కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

## ఆరేళ్ల బాలుడిపై వీధి
# కుక్కల దాడి.. వంటిపై తీవ్ర గాయాలు





నర్సాపూర్ (ప్రజాజ్యోతి) బాలుడిపై ఒక్కసారిగా వీధి కుక్కల గుంపు దాడి చేశాయి. అమాయకపు చిన్నారిపై పడి, అతడిని కింద పడేసి శరీరాన్ని విచక్షణారహితంగా కరిచాయి. ఈ హృదయ విదారక ఘటన బుధవారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధి ఎనిమిదవ వార్డులో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన షేక్ మక్బుల్ కుమారుడైన ఆరు సంవత్సరాల షేక్ అలీ, చాక్లెట్ కొనుక్కోవడానికని ఇంటి నుండి బయటకు వెళ్తున్న క్రమంలో బాలుడు పై వీధి కుక్కలు దాడికి పాల్పడి శరీరంపై పలుచోట్ల తీవ్రంగా కరిచాయి. బాలుడి ఆర్తనాదాలు విని చుట్టుపక్కల ప్రజలు పరిగెత్తుకు వచ్చి కుక్కలను తరిమికొట్టారు. గాయపడిన బాలుడిని తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**ప్రాణాలు పోతున్న పట్టించుకోరా**

గత కొంతకాలంగా 8వ వార్డుతో సహా పట్టణంలో వీధి కుక్కల సంఖ్య భయంకరంగా పెరిగిపోతుంది. ఇంటి నుండి బయటకు రావాలంటే నే ప్రజలను భయపడుతున్నారు. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన వారు కనీసం పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం చేశారు.

# సిఐటియు రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయండి

– దుబ్బాకలో వాల్ పోస్టర్ విడుదల సిఐటియు జిల్లాకోశాధికారి భాస్కర్



దుబ్బాక ప్రతినిధి డిసెంబర్ 03( ప్రజాజ్యోతి) సిఐటియు రాష్ట్ర 5వ మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ దుబ్బాక మండల కేంద్రంలో సిఐటియు కార్యాలయం వద్ద వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. అనంతరం సిఐటియు జిల్లా కోశాధికారి జి. భాస్కర్ మాట్లాడుతూ... కార్మిక,ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న సిఐటియు తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు 2025 డిసెంబర్ 7,8,9 తేదీలలో మెదక్ పట్టణంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల సందర్భంగా డిసెంబర్ 7న మెదక్ పట్టణంలో జరిగే కార్మిక మహా ప్రదర్శన – బహిరంగ సభకు కార్మికులు,ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగసభకు ముఖ్యఅతిథిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి %డి%ి రాఘవులు అఖిలభారత అధ్యక్షురాలు కే. హేమలత సిఐటియు అఖిలభారత కోశాధికారి %వీ%.సాయిబాబు గారు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ మహాసభలకు అంగన్వాడి,ఆశా,వీఓ, గ్రామ పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, మెడికల్ %ఓ% హెల్త్, మధ్యాహ్న భోజన,మెప్మా, ఆర్పి,వివిఏ, మరియు ఆటో, హమాలీ,భవన నిర్మాణ, పరిశ్రమలకార్మికులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను తెచ్చిందని విమర్శించారు. ఈ కోడ్ ల వలన కార్మికులు అనేక హక్కులను కోల్పోయి బానిసలుగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీస వేతనాలు నెలకు 26000 రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 7 న జరిగే బహిరంగ సభకు సిద్దిపేట జిల్లాలోని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు దుబ్బాక పట్టణ కన్వీనర్ కొంపల్లి భాస్కర్,సిఐటియు నాయకులు నాగరాణి, బత్తుల రాజు, మహేష్, నాగరాజు, బట్టు ఎల్లం సాజిద్, సంతోషి,స్వరూప,పద్మ, బాబాయ్,జ్యోతి, పోశవ్వ,తదితరులు పాల్గొన్నారు.

# అంగవైక్యం హిందూ ధర్మానికి అడ్డు కాదని నిరూపించిన వీరేంద్ర

– అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో వీరేంద్రను సన్మానించిన భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు



రాయపోల్, డిసెంబర్ 3 (ప్రజా జ్యోతి):- శరీరంలో లోపాన్ని చూసి జాలిపడటం కాదని, వారి ఆత్మ విశ్వాసం చూసి స్ఫూర్తి పొందాలని, వైకల్యం ఒక స్థితి మాత్రమేనని విజయానికి అడ్డంకి కాదని, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హిందు సనాతన ధర్మమే ప్రాణంగా భావిస్తు నేడు యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన మఠం సోమేశ్ కుమారుడైన మఠం వీరేంద్ర. అతని ప్రచార భక్తి అమోఘం అని బుధవారం నాడు శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు సీతారాముల చిత్ర పఠంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యంగుడైనా మఠం వీరేంద్ర ఆధ్యాత్మిక యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నాడన్నారు. హిందూ సమావేశాలు, సభలు ఎక్కడ జరిగిన కూడా నేను దివ్యాంగుణ్ణి అని చూడకుండా వెళ్లి అక్కడ హిందూ ధర్మం ఐక్యతను చాటుకుంటున్నారు. హైందవ ధర్మమే నా ప్రాణమని నా అంగ వైకల్యం నా ధర్మానికి అడ్డు కాదని దిగులు పడక ముందుకు సాగుతున్న మఠం వీరేంద్ర మనందరికీ ఆదర్శం అన్నారు. సామాజిక మాధ్యమాల్లో కూడా హిందూ ధర్మ గొప్ప తనాన్ని ప్రపంచానికి తెలియజేస్తుండడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో జంగం సమాజం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మఠం సోమేశ్, బీజేపీ జిల్లా కోశాధికారి ఉప్పల మధు, కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పాకాల్ల వెంకట్ రాంరెడ్డి, మఠం వీరేంద్ర తల్లి పుష్పాంజలి పాల్గొన్నారు.

# భారత్ విభిన్న సంస్కృతుల నిలయం

– శ్రీ దత్తగిరి పీఠాధిపతులు భక్తిశ్రద్ధలతో శ్రీ చండీ, శ్రీ దత్త యజ్ఞాలు
– నేడు దత్తాత్రేయ జయంతి దీపోత్సవం, డోలారోహణ





జహీరాబాద్, డిసెంబర్ 03(ప్రజాజ్యోతి న్యూస్) భారతదేశం సంస్కృతి సాంప్రదాయా లకు నిలయమని, ప్రతి ఒక్కరు భారతదేశపు సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలని బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, మహంత్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. శ్రీ దత్త జయంతి సందర్భంగా రెండవ రోజు దత్త యజ్ఞం చండీ యజ్ఞం, భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10:45 గణపతి పూజ%తీ% ప్రారంభమైన యజ్ఞం పుణ్యాహవచనం, మంటపారాధన, ఆవాహిత దేవపూజ, శ్రీ యంత్రపూజ, శ్రీ చండీ పారాయణం, మహ మంగళహారతితో 3:34 యజ్ఞం పూర్ణాహుతితో ముగిసింది. అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు మాట్లాడుతూ... భారతదేశ సంస్కృతి భారత దేశంలో వేర్వేరుగా ఉన్న అన్ని మతాలు, వర్గాలు, భాషలు, కులాల, వర్గాల సమష్టి కలయిక అని దేశంలో వివిధ భాషలు, మతాలు, సంగీతం, నృత్యం, ఆహారం, నిర్మాణ కళ , ఆచారాలు, వ్యవహారాలు దేశంలో ఒక్కో ప్రాంతానికి ఎంతో భిన్నంగా ఉంటాయని కని భారతీయ సంస్కృతి అనేది అనేక సంస్కృతుల సమ్మేళనంగా వివరించుతుందన్నారు. యజ్ఞానికి సుమారుగా 116 మంది దంపతులు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుండి కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు హాజరై శ్రీ దత్తాత్రేయ స్వామి, పంచ వృక్షాలు, జ్యోతిర్లింగాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**నేడు దత్త జయంతి**

మార్గశిర పౌర్ణమి గురువారం దేశవ్యాప్తంగా దత్త జయంతి ఉత్సవాలు నిర్వహించ నున్నారు. దత్త క్షేత్రమైన బర్దిపూర్ భక్తుల రాక కోసం ఇప్పటికే పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. గురువారం దత్త, చండి హోమం పూర్ణాహుతి, స్వామివారికి దూలారోహణం, సాయంత్రం దీపోత్సవం విశ్వ మానవ ధర్మ ప్రచారం సభ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం గుప్తా వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## గడువు ముగిసిన
# వస్తువులు అమ్మితే కఠిన చర్యలు



సిద్దిపేట, డిసెంబర్ 3, (ప్రజా జ్యోతి) : గడువు ముగిసిన వస్తువులను అమ్మితే కఠిన చర్యలు తప్పవని పట్టణ కమిషనర్ అశ్రిత్ కుమార్ హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్ రోడ్డులోని మోర్ సూపర్‌మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. పరిశీలనలో గడువు ముగిసిన పలు ఆహార పదార్థాలు విక్రయానికి ఉంచినట్లు గుర్తించారు. వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తూ ఇలాంటి అక్రమాలు చేయకుండా 20,000 రూపాయల జరిమానా విధిస్తూ మేనేజ్‌మెంట్‌ను కమిషనర్ కఠినంగా హెచ్చరించారు. వస్తువులు కొనుగోలు చేసే సమయంలో గడువు తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని ప్రజలకు సూచించారు. గడువు ముగిసిన ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా ఆరోగ్య భద్రతలో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. చెత్త పారవేతపై కఠిన చర్యలు పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు బ్లాక్ స్పాట్ నిర్మూలనలో భాగంగా ప్రత్యేక ఎన్ఫోర్స్మెంట్ బృందం ప్రతిరోజూ ఉదయం పర్యటిస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు వేస్తోంది. ఈ క్రమంలో మిలన్ గార్డెన్ సమీపంలో చెత్త పారేస్తూ పట్టుబడిన శ్రీకాంత్, రాజు వారికి చెరో 1000 రూపాయలు, ప్రసాద్‌కు 500 రూపాయల జరిమానా విధించారు. ఆర్ ఆర్ పాల డెయిరీ దుకాణ చెత్తను బహిరంగ ప్రదేశంలో పడేశారని గుర్తించి 500 రూపాయల జరిమానా విధించారు. మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతమైతే భారీ జరిమానా తప్పదని కమిషనర్ హెచ్చరించారు.

# గ్రామ పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

కొమురవెల్లి, డిసెంబర్ 3 (ప్రజా జ్యోతి):- జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొమరవెల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్ హరిప్రసాద్ ను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అంకిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో జరిగిన విచారణలో భాగంగా వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు నిన్న సాయంత్రం హరిప్రసాద్ కు అందజేసినట్లు సంబంధిత శాఖ వెల్లడించారు. అధికారుల ఉత్తర్వులు జారీచేసి సస్పెండ్ చేసినట్లు కొమురవెల్లి ఎంపీడీవో లక్ష్మప్ప తెలిపారు తెలిపారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీ
# వలకు చిక్కిన వెల్దుర్తి మండల సర్వేయర్

మెదక్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్



వెల్దుర్తి (ప్రజాజ్యోతి) డిసెంబర్ 3 వెల్దుర్తి మండలంలో అవినీతి మరోసారి వెలుగులోకి వచ్చింది. భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తానని రైతును వేధించి, లంచం తీసుకుంటుండగా మండల సర్వేయర్, ట్రైని సర్వేయర్ ఇద్దరినీ ఏసిబి అధికారుల వలలో చిక్కారు. మెదక్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ వివరాల ప్రకారం ఒక రైతు రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాల పరిశీలన, భూసర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తానని చెప్పి సర్వేయర్ శ్రీనివాస్, ట్రైని సర్వేయర్ శరత్ కుమార్ 20,000 లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బాధిత రైతు ఎసిబిని ఆశ్రయించగా, ఏసీబీ ఏర్పాటు చేసిన ఉచ్చు ఆపరేషన్‌లో సర్వేయర్‌ను లంచం స్వీకరిస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడ్డ ఇద్దరినీ రిమాండ్ కి తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు

# దివ్యాంగులు మనోధైర్యంతో అన్ని రంగాలలో ముందుండాలి



జిల్లా ఆదనపు కలెక్టర్ లింగ్యా నాయక్





**వికారాబాద్ ప్రతినిధి, డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** దివ్యాంగులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని పుట్టుకతో వికలాంగత్వం కలిగితే నిరాశ పడకుండ మనో ధైర్యంతో దృడ సంకల్పంతో అన్ని రంగాలలో ముదంజలో ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. బుధవారము అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా సమాఖ్య సమావేశము హాలు నందు జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్‌ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా సమాజ అభివృదిలో అందరికి సమాన హక్కులు కల్పించి పరిరక్షించే విధంగా అంతర్జతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యంగా పరంగా ఇచ్చిన హక్కులను సద్వినియోగ పరుచుకొని సమాజ అభివృదిలో ముందుకు వెళ్ళాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రభుత్వం దివ్యాంగులకు హక్కులను కలిపించడంతో పాటు సమాజంలో వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. దివ్యాంగుల ఆత్మ స్తైర్యంతో ముందుకు వెళ్ళాలని, ప్రభుత్వం అన్ని విదాలుగా కృషి చేస్తుందని తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులు క్రీడలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రంతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారిని కృష్ణవేణి, మెప్మా రవి కుమార్, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, దివ్యాంగులు. తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సంరక్షణ పనులపై చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంక వర్గీస్ స్వయంగా సమీక్ష





**వికారాబాద్ ప్రతినిధి, డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** వికారాబాద్ జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరుగుతున్న పునర్వనీకరణ పనులు, అర్బన్ పార్క్ అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్య అటవీ సంరక్షణాధికారి (చార్మినార్ సర్కిల్) ప్రియాంకా వర్ఘీస్ గత రెండు రోజులుగా పరిశీలించారు. డిసెంబర్ 2 మరియు 3 తేదీల్లో వరుసగా జిల్లా అంతటా పర్యటించిన ఆమె, చేపట్టిన పనుల నాణ్యతను, పురోగతిని సవివరంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా, ధారూర్ రేంజ్ పరిధిలోని రుద్రారం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన 10 హెక్టార్ల ఎస్ఎమ్ఎమ్ ప్లాంటేషన్‌ను పరిశీలించిన ఆమె, మొక్కల పెరుగుదల, నిర్వహణ, సంరక్షణ చర్యలను అడుగుతూ వార్షిక లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు సూచించారు. తరువాత వికారాబాద్ రేంజ్ పరిధిలోని అనంతగిరి ఎకో–అర్బన్ పార్క్ ను సందర్శించిన ప్రియాంకా వర్ఘీస్, వాచ్‌టవర్, గెజిబో వంటి ప్రాజెక్టుల నిర్మాణం, వినియోగ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతగిరి పర్యాటక కేంద్రానికి అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చే నేపథ్యంలో, వారి సౌకర్యాలను ఇంకా అభివృద్ధి చేసి మెరుగు పరచాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. పార్క్‌లో పర్యావరణ అనుకూల వసతులను పెంచాలని, సందర్శకుల అనుభవాన్ని మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ సంరక్షణ చర్యలు, పచ్చదనం విస్తరణ, పర్యాటక వసతుల అభివృద్ధిపై అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ప్రియాంకా వర్ఘీస్ ప్రత్యేకంగా సూచించినట్లు తెలుస్తోంది. ఈ తనిఖీ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి జి.జ్ఞానేశ్వర్, వికారాబాద్ రేంజ్ అధికారి కె.శ్యామ్ కుమార్, ధారూర్ రేంజ్ అధికారి బి. రాజేందర్, సంబంధిత సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల దినోత్సవాన్ని ప్రభుత్వం విస్మరించి అవమానించడం బాధాకరం



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి






**బాలాపూర్ డిసెంబర్ 3 (ప్రజాజ్యోతి) :** డిసెంబర్ 3న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించుకోవాల్సిన వికలాంగుల దినోత్సవం ప్రభుత్వం విస్మరించి అవమానపరచడం చాలా బాధాకరమని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పలువురు దివ్యాంగులకు ట్రై–సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 3న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వికలాంగుల సామాజిక, ఆర్థిక, వైద్య, విద్యా రంగాల్లో సాధికారతను అవలంబింపజేయడం కీలకమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు దక్కాలని గుర్తుచేసే ముఖ్యమైన రోజు అన్నారు. అధికారికంగా జరుపుకోవాల్సిన ఇటువంటి ముఖ్యమైన రోజును ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం చాలా బాధాకరమని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి మంత్రులకు సోయిలేకుండా బాధ్యతరహితంగా వ్యవహరించడం వికలాంగులపై చిత్తశుద్ధి లేదనే దానికి నిదర్శనం అన్నారు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై అధికారుల తీరును తప్పు పట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు దివ్యాంగుల పెన్షన్ కేవలం రూ.500 మాత్రమే ఉండేదని, కేసీఆర్ సీఎం అయిన తర్వాత దివ్యాంగుల పరిస్థితులను అర్థం చేసుకుని దశలవారీగా పెంచుతూ రూ.4 వేల వరకు తీసుకువచ్చారని ఆమె గుర్తుచేశారు. ఎన్నికల ముందు దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6,000 చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటను పూర్తిగా మరచిపోయిందని, వారి సంక్షేమంపై ఎలాంటి శ్రద్ధ చూపకపోవడం దురదృష్టకరమని ఆమె విమర్శించారు.

దివాంగుల ఓట్ల కోసం మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం కనీసం దివాంగుల దినోత్సవం జరుపుకోకుండా అవమానించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, మురుకుంట్ల అరవింద్, అరకాల భూపాల్ రెడ్డి, రాజ్‌కుమార్, మాదరి రమేష్, విజయ్, లక్ష్మణ్ ముదిరాజ్, గోపి యాదవ్, విజయలక్ష్మి, ప్రభాకర్ రెడ్డి, రాళ్ల బండి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుడు శ్రీకాంత్ ఆచారి ఘనంగా వర్ధంతి

– బీసీలకు రాజ్యాధికారతో తెలంగాణ అభివృద్ధి మార్గం

– టిఅర్‌పి పార్టీ ప్రధాన కార్యదర్శి వేములవాడ మదన్మోహన్ చారి



**సికింద్రాబాద్, డిసెంబర్ 3, (ప్రజాజ్యోతి) :** తెలంగాణ అమరవీరుడు శ్రీకాంత్ ఆచారి వర్ధంతి కార్యక్రమం వేములవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి వేములవాడ మదన్మోహన్ చారి, బీసీ నాయకులతో కలిసి అమరుడు శ్రీకాంత్ ఆచారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు మదన్మోహన్ చారి అన్నారు. అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ నేడు ఆశించిన అభివృద్ధి దిశగా నడవకపోవడం బాధాకరంఅని తెలిపారు. తెలంగాణ నిజమైన అభివృద్ధి బీసీలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సాధ్యమవుతుంది తెలిపారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం పోరాడిన అమరుల ఆశయాలను నెరవేర్చే దిశగా రాజకీయ వ్యవస్థ మారాలి" అని స్పష్టం చేశారు. అమ్మవీరుల ధ్యేయాలు ప్రజల జీవితాల్లో సాకారం కావాలంటే బీసీ వర్గాలు ఐక్యంగా ముందుకు సాగి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ అధ్యక్షుడు బాలరాజు, పలువురు బీసీ నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరుడి స్మృతిని స్మరించుకున్నారు.

# అయ్యప్ప స్వామి ప్రత్యేక పూజలో... ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డి



**బాలాపూర్ డిసెంబర్ 3 (ప్రజాజ్యోతి) :** నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 36వ డివిజన్‌లో, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం శాసన సభ్యురాలు శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అయ్యప్ప స్వామి భక్తులకు ఆ స్వామి ఆశీస్సులు ఉండాలని భక్తి మార్గం అనేది మనసును పవిత్రం చేసేది, సమాజాన్ని శాంతి–సౌఖ్యాలతో నింపేదని ఆమె అన్నారు. హరిహరసుతుడైన అయ్యప్ప స్వామి పట్ల భక్తుల అనురాగం అపారమని, ప్రతి సంవత్సరం జరిగే అయ్యప్ప పూజలు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, దిండు రాజు గౌడ్, అర్కల భూపాల్ రెడ్డి, దిండు శంకర్ గౌడ్, మదారి రమేష్, జిల్లా విజయ్, లక్ష్మణ్ ముదిరాజ్, రాజ్ కుమార్, సిద్దాల అంజయ్య, గోపి యాదవ్, ప్రభాకర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సిల్వేరి సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

# అమరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు





**బోయిన్ పల్లి, డిసెంబర్ 3 (ప్రజాజ్యోతి) :** 119 డివిజన్ ఓల్డ్ బోయిన్ పల్లి, కూకట్ పల్లి నియోజకవర్గం హస్మత్‌పేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో తెలంగాణ మల్లిదిశ తొలి అమరుడు కాసోజి శ్రీకాంతాచారి 16వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, అమరుడు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి, క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పించారు. ఉద్యమకారులు, స్థానిక నాయకులు, పాత్రికేయులు, మీడియా మిత్రులు ఈ వేడుకలో పాల్గొని అమరుడి స్ఫూర్తిని స్మరించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ సీనియర్ నాయకుడు కూతాడి రవికుమార్, మాజీ రంగారెడ్డి జిల్లా ఎస్టీ విభాగ అధ్యక్షులు & గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రెటరీ టీ. శ్రీశైలంచారి, రాజు గౌడ్, పిట్ల రాజు, గణేష్ గుప్తా, మేకలా హరినాథ్, బుర్ర యాదగిరి, కృష్ణ కుమార్, మమ్మద్ ఖదీర్, గంగపుత్ర సంఘం కృష్ణ, జై కృష్ణ, జానీ, సలీం పాషా, అసలం , దాసరి ఎల్లయ్య, కూతాడి రాజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ వార్డు నెంబర్ అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలను ఉపయోగించుకోవాలి

– చౌడాపూర్ మండల ఎంపీడీఓ సోమలింగం



**చౌడాపూర్ మండల్ (ప్రజాజ్యోతి) డిసెంబర్ 03 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిదిలోని బుధవారం నుండి ఎన్నికల సందర్భంగా నామినేషన్లు స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని యం.పి డి.ఓ.సోమలింగం అన్నారు. మొత్తం ఇరువై నాలుగు గ్రామా పంచాయితిలకు గాను ఆరు నామినేషన్ కేంద్రాలు వున్నాయి. చౌడాపూర్, మందిపాల్ లింగంపల్లి, మరికల్, కన్మన్ కాల్వ, కొతపల్లి, గ్రామాలు నామినేషన్ కేంద్రాలుగా ఏర్పాటు చేయడం జరిగింది. అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు చౌడపూర్ మండల ప్రజలు ఎన్నికలు శాంతియుతంగా ప్రశాంతంగా జరగడానికి అందరు సహకరించాలని కోరారు.

# గ్రామాన్నిఅభివృద్ధి చేసే వ్యక్తికే ఓటు వేయాలి



**యాలాల్ డిసెంబర్ 3 ప్రజాజ్యోతి :** జయాలాల మండల కేంద్రంలో గ్రామాన్ని అభివృద్ధి చేసే వ్యక్తికి ఓటు వేయాలని యాలల గ్రామానికి చెందిన బిజెపి నాయకులు మల్గేరి నర్సింలు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని ఆయన సూచించారు. బుధవారం ప్రజా జ్యోతి దినపత్రికలో తాను ఏ ఒక్క పార్టీకి ఓటు వేయవద్దని సూచించలేదని ఖండించారు. కాంగ్రెస్, టిఆర్ఎస్, ఇండిపెండెంట్ లలో నిలబడిన వ్యక్తుల్లో ఎవరు మంచివారు వారికి ఓటు వేయాలని మల్గేరి నర్సింలు కోరారుకోర. బుధవారం వచ్చిన ప్రజా జ్యోతి దినపత్రికలో తాను ఏ ఒక్క పార్టీకి మాత్రమే ఓటు వేయాలని చెప్పలేదని నరసింహులు పేర్కొన్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డీవో వాసుచంద్ర



**పరిగి, డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** పరిగి మండలంలోని గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తూ ఆర్‌డీవో వాసుచంద్ర బుధవారం నామినేషన్ కేంద్రాలను సందర్శించారు. మధ్యాహ్నం రంగంపల్లి గ్రామంలోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి, అభ్యర్థుల నామినేషన్ దాఖలు ఏర్పాట్లు, సిబ్బంది విధుల నిర్వహణ, భద్రతా చర్యలను సమీక్షించారు. తదుపరి రూపఖాన్‌పేట, గడిసింగాపూర్ గ్రామాల నామినేషన్ కేంద్రాలను కూడా సందర్శించిన ఆర్‌డీవో అక్కడి ఎన్నికల అధికారులతో సమావేశమై నామినేషన్ ప్రక్రియ సాఫీగా సాగేందుకు సూచనలు ఇచ్చారు. కేంద్రాలలో ఉండాల్సిన అన్ని ఎన్నికల సౌకర్యాలు, రికార్డ్ నిర్వహణ, ప్రజా రద్దీని నియంత్రించే చర్యలను స్వయంగా పరిశీలించారు. గ్రామాల్లో నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు లోబడి జరగాలని ఆర్‌డీవో అధికారులు, సిబ్బందికి సూచించినట్లు తెలిసింది. గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభం కావడంతో మండలంలో ఎన్నికల ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరి, ఎస్ఐ మోహన్ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారం మరువలేనిది



**దోమ డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని కస్తూరీభా గాంధీ బాలికల విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ శైలజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాలకు దాతలు ఆర్యన్ రాజ్ పుత్ మరియు దీపన్ భూపతి సామాజిక సేవకురాలు అయిన అనిత,నిఖిత ప్రోత్సహంతో సుమారు 80 వేలు విలువ గల వాలిబాల్, సెటిల్ కోర్టు పోల్స్, స్పోర్ట్స్ మెటీరియల్, మరియు స్టడీ మెటీరియల్, స్టేషనరీ,ను అందజేయడం జరిగింది. విద్యార్థులు బాగా చదివి మంచి స్థాయి లో ఉండాలని తెలియజేశారు. క్రీడలు విద్యార్థులు శారీరకంగా మానసికంగా ఎదగడం తో పాటు క్రమశిక్షణ కు దోహదం చేస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ గ్యామా,నాయబ్ తహసీల్దార్ నర్సింలు, ఎంఈఓ వెంకట్, ఎస్సై వసంత్ కుమార్ జాదవ్,గండిపేట యుపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు,కెజిబివి పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పింక్ డ్రెస్సులతో మెరిసిన షిష్యా స్కూల్ చిన్నారులు



**బోయిన్‌పల్లి, డిసెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** ఓల్డ్ బోయిన్‌పల్లి షిష్యా స్కూల్ ఆడిటోరియంలో బుధవారం పింక్ డే వేడుకలను సందడిగా నిర్వహించారు. చిన్నారుల్లో రంగుల పట్ల అవగాహన పెంపొందిం చడం, ఉల్లాసభరితమైన పాఠశాల వాతావరణాన్ని సృష్టించడం లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పింక్ డ్రెస్సులతో పాల్గొని ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ మహేష్, అనిత టీచర్‌తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. చిన్నారులు పింక్ కలర్ టాయ్స్, ఫ్లవర్స్, క్రాఫ్ట్ ఐటమ్స్‌తో థీమ్‌కు అనుగుణంగా చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పింక్ డే ఉద్దేశ్యం, పింక్ రంగు ప్రాధాన్యత గురించి పిల్లలకు అధ్యాపకులు వివరించారు. ప్రిన్సిపాల్ మహేష్ మాట్లాడుతూ ఇలాంటి థీమ్ ఆధారిత కార్యక్రమాలు విద్యార్థులకు సృజనాత్మకతను పెంపొందిస్తాయి, ఆనందభరితమైన పాఠశాల అనుభవాన్ని అందిస్తాయి అని తెలిపారు.

# పారిశుద్ధ కార్మికులకు మంకీ క్యాప్స్, మాస్కుల పంపిణీ







**బోయిన్‌పల్లి, డిసెంబర్ 3 (ప్రజాజ్యోతి) :** న్యూ బోయినపల్లి సర్కిల్ కార్యాలయం పరిధిలో చలికాలంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులకు అఖిల భారతీయ సఫాయ్ కాంగర్ సంఘటన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కరణ్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం మంకీ క్యాప్స్, మాస్కులు పంపిణీ చేశారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై మొత్తం 60 మంది పారిశుద్ధ కార్మికులకు మంకీ క్యాప్స్, మాస్కులు అందించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ చలికాలంలో తెల్లవారుజాము నుంచే కాలనీలు, బస్తీలు, ప్రధాన అంతర్గత రోడ్లపై చెత్త, చెదారం తొలగించేందుకు ఎంతో కష్టపడి విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులకు రక్షణా చర్యగా మంకీ క్యాప్స్, మాస్కులు పంపిణీ చేయడం అభినందనీయం అని తెలిపారు. కార్యక్రమంలో దాఫెదార్ విజయ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘటన్ తెలంగాణ ఇన్‌చార్జ్ సి.హెచ్. వినోద్ సింగ్, స్థానికులు సాయిబాబా యాదవ్, సత్యనారాయణ, బండి శ్రీను, యాదగిరి, జంపన రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులను ఆదరించండి

### జిల్లా విద్యాధికారి కె.రాము

జగిత్యాల టౌన్, డిసెంబర్03, ప్రజాజ్యోతి
జగిత్యాల పట్టణంలోని భవితా కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసి జిల్లా విద్యాధికారి కె.రాము మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను ఆదరించాలని వారిని దేవుడిచ్చిన ప్రసాదంగా భావించాలని భారంగా భావించకూడదని అని అన్నారు. దివ్యాంగులను ప్రోత్సహించి శారీరక మానసిక




ఎదుగుదలకు తోడ్పడాలని వారన్నారు పిమ్మట పిఆర్టియు టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు మాట్లాడుతూ దివ్యాంగులు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా సాంస్కృతి విభాగాల్లో ఎదగాలని దివ్యాంగుల దినోత్సవం ముఖ్య ఉద్దేశం అని దివ్యాంగులను గౌరవించి వారి అవసరాలను తీర్చి సమాన హక్కులు కల్పించి సమాజాభివృద్ధిలో భాగస్వాములు చేయాలని వారు అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల లోగెలుపొందిన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఆర్ ఈ పి లు రాజేందర్ రాజబాబు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబర్03, ప్రజాజ్యోతి
జగిత్యాల పట్టణంలో 12,28,29,30 వార్డులలో 53 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు,డ్రైనేజీ, బీటీ రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన , మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం అడువల జ్యోతి లక్ష్మణ్,డీఈ ఆనంద్ బాలేశంకర్,వార్డు మాజీ కౌన్సిలర్ లు పంబల



రాము,మేకపద్మావతి పవన్ మ్యకల పవన్,దుమాల రాజ్ కుమార్,పెద్దింటి రాజు,ఏఈ అనిల్,లక్ష్మీ, టిపిబిఓ శ్రీకర్,తాజా మాజీ కౌన్సిలర్ లు వార్డునాయకులు,మహిళలు,యువకులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ను కలిసిన జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య

జగిత్యాల టౌన్, డిసెంబర్ 03,ప్రజాజ్యోతి
జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిసిన జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు ని శాలువాతో



సత్కరించారు. జగిత్యాల నియోజకవర్గం లో సర్పంచ్ ఎన్నికలలో మెజారిటీ గ్రామపంచాయతీలో ఏకగ్రీవ ఎన్నిక జరిగేలా అభ్యర్థులను ప్రోత్సహించడానికి తోడ్పాలని అన్నారు.

## కోరుట్లలో అక్రమ నిర్మాణాలపై మున్సిపాలిటీ దండయాత్ర

కోరుట్ల, డిసెంబర్ 3 ప్రజాజ్యోతి
కోరుట్ల పట్టణంలోని ఐలాపూర్ రోడ్డులో కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రభుత్వ నాలాను ఆక్రమించుకునేందుకు ప్రయత్నించిన విషయం మున్సిపల్ అధికారుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి ప్రత్యేక బృందం మోఖపైన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా, ప్రజా వినియోగానికి సంబంధించిన ముఖ్యమైన నాలాను మొరం వేసి పూర్తిగా మూసివేయడం జరిగినట్లు కనిపించింది. దాంతో మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, పూడ్చివేసిన నాలాను మళ్లీ తవ్వించి యధాతథ స్థితికి తీసుకువచ్చారు. ప్రకృతి సిద్ధంగా



నీరు ప్రవహించేలా మార్గాన్ని శుద్ధి చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా, అదే ప్రాంతంలో బఫర్ జోన్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన బేస్మెంట్‌ను కూడా మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. బఫర్ జోన్, నీటి ప్రవాహ మార్గాలలో నిర్మాణాలు తీవ్ర నష్టాలకు దారితీసే అవకాశం ఉందని కమిషనర్ స్పష్టంగా తెలిపారు. ఈ సందర్భంగా కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ,పట్టణంలో అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేయరాదు. 2019 నూతన మున్సిపల్ చట్టం ప్రకారం అక్రమంగా నిర్మించిన కట్టడాలను ఎలాంటి నోటీసు అవసరం లేకుండా తొలగించే అధికారం మున్సిపాలిటీకి ఉంది అని హెచ్చరించారు. అలాగే పట్టణ అభివృద్ధి, శుభ్రత, సుందరీకరణ కోసం ప్రజలందరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలి అని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడితే తీవ్ర చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

# దివ్యాంగులకు అండగా ఉంటాం

**ఉన్నత చదువులు చదివేలా సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తాం**
**ఐదు శాతం ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తాం**
**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 3 (ప్రజాజ్యోతి)
దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని.. వారు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం శాతవాహన యూనివర్సిటీ సమీపంలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం



నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని.. నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్ లాంగ్వేజ్ ద్వారా తరగతులు బోధిస్తామని వివరించారు. దివ్యాంగులు తమలోని దివ్య దృష్టిని వృధా చేయవద్దని.. ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారుఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సు పాసుల సమస్య కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. దివ్యాంగులు ఉంటున్న పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ కి సూచించారు. వచ్చే ఏడాది (దివ్యాంగుల దినోత్సవం) కల్లా దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్య దృష్టి యూట్యూబ్ ఛానల్ ను ఆవిష్కరించారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో దివ్యాంగులు పాడిన పాటను సీఎం ఆవిష్కరించినట్లు అతిథులు వివరించారు. దివ్యాంగుల శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న దివ్యాంగులలో అద్భుత ప్రతిభ ఉంటుందని వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. సైన్ లాంగ్వేజ్ లో జనగణమన పాడిన కలెక్టర్ బృందాన్ని అభినందించారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. యూపీఎస్సీ వంటి ఉన్నత ఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నారని.. చదువును నమ్ముకుని ముందుకు సాగాలని సూచించారు. వయో వృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూలి మన రాష్ట్రంలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కలెక్టర్ చేపడుతున్న చర్యలను అభినందించారు. అనంతరం అతిథులను అధికారులు, సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూప రాణి, అధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని

కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 3( ప్రజాజ్యోతి)
రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ, దాఖలైన నామినేషన్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండవ విడత నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, మూడవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కూడా తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ బాక్సులు, శాంతిభద్రతలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్ లో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిమాట్లాడుతూ మొదటి విడతలో 92 సర్పంచ్ స్థానాలకు 730 నామినేషన్లు, 866 వార్డు సభ్యుల స్థానాలకు 2174 నామినేషన్లు దాఖలు అయ్యాయని చెప్పారు. రెండో విడతలో 113 సర్పంచ్ స్థానాలకు 888, 1046 వార్డు సభ్యుల స్థానాలకు 3056 నామినేషన్లు దాఖలు అయినట్లు వెల్లడించారు. నామినేషన్ వేయని సర్పంచ్ లేదా వార్డు సభ్యుల స్థానాలు ఇప్పటివరకు లేవని తెలిపారు. 125 వార్డు స్థానాలకు ఒకే ఒక నామినేషన్ దాఖలు అయినట్లు వెల్లడించారు. 2946 పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, మొదటి దశ నామినేషన్ల పరిశీలన కూడా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయిలలో అధికారులతో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని తెలిపారు. 19 శాతం పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైన గుర్తించి పటిష్ట బందోబస్తుకు చర్యలు




తీసుకుంటున్నామని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 635 మందిని బైండోవర్ చేశామని, 33 లైసెన్స్ తుపాకులను డిపాజిట్ చేసుకున్నామని వివరించారు. ఇప్పటివరకు 70 అక్రమ మద్యం కేసులు, ఎన్ డి పి ఎస్ చట్టం కేసు ఒకటి నమోదైనట్లు వెల్లడించారు. గ్రామ పోలీసు అధికారులను కేటాయించి క్షేత్రస్థాయిలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్సో కలెక్టర్, సిపితో పాటు అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వర్లు, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పిర్యాదుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి

### నగర పాలక సంస్థ కమీషనర్ ప్రఫూల్ దేశాయ్

కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 3( ప్రజాజ్యోతి)
నల్లా సర్వేకు నేపథ్యంలో ప్రజల నుండి వస్తున్న వివిధ రకాల సందేహాలు, ఫిర్యాదుల కోసం నగరపాలక సంస్థ ఇన్ వార్డు ఆవరణలో ఒక ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం రోజు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అభివృద్ధి పనులతో పాటు అమృత్, స్వచ్ఛభారత్ మిషన్, అమృత్ మిత్ర, నల్లా కనెక్షన్ సర్వే, విద్యుత్ మీటర్ సర్వే తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. స్మార్ట్ సిటీ లో చేపట్టిన వివిధ ప్రాజెక్టు పనులు, అమృత్ పథకం, అమృత్ మిత్ర, వివిధ గ్రాంట్ల అభివృద్ధి పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ్ భారత్ మిషన్, అమృత్ మిత్ర నిధుల సద్వినియోగం, చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి పలు సూచనలు చేస్తూ... అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ లో చేపట్టిన స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులతో పాటు వివిధ గ్రాంట్ల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగర వ్యాప్తంగా డివిజన్ల వారిగా చేస్తున్న నల్లా కనెక్షన్ సర్వేను మరింత వేగవంతం చేయాలని... సర్వేను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలన్నారు. నీటి సరఫరా నల్లా కనెక్షన్ సర్వే నేపథ్యంలో ప్రజల నుండి వస్తున్న వివిధ రకాల సందేహాలు, ఫిర్యాదులు వస్తున్నాయని వాటికి కోసం నగరపాలక సంస్థ పౌరసేవ కేంద్రంలో ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిఈ స్థాయి అధికారి నోడల్ ఆఫీసర్ వ్యవరిస్తూఏఈ, వర్క్ ఇన్





స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ నోడల్ ఆఫీసర్ కంట్రోల్ లో విధులు నిర్వహిస్తూ...
ప్రజల నుండి వచ్చే నల్లా కలెక్షన్ సందేహాలు, ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నల్లా కనెక్షన్ సర్వే నేపథ్యంలో ప్రజలు ఎలాంటి సందేహాలు , ఫిర్యాదులు ఉన్న ప్రత్యేక కౌంటర్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈలు సంజీవ్ కుమార్, శివానంధం, డీఈలు దేవేంధర్, లచ్చిరెడ్డి, అరుణ్, వెంకటేశ్వర్లు, ఓం ప్రకాష్, ఏఈలు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందుచేత

జగిత్యాల టౌన్,డిసెంబర్ 03,ప్రజాజ్యోతి
జగిత్యాల పట్టణ రాయల్ ఫంక్షన్ హాల్ లో జగిత్యాల పట్టణానికి చెందిన 126 మంది ఆడబిడ్డలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన,మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం అడువల జ్యోతి లక్ష్మణ్,డీఈ ఆనంద్ తాజా మాజీ కౌన్సిలర్ లు నాయకులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు

### అభినందించిన జిల్లా విద్యాశాఖ అధికారి, "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబర్ 3( ప్రజాజ్యోతి)
స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కు చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు జిల్లా స్థాయి ప్రథమ స్థానం, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.
సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. విద్యార్థులకు వైజ్ఞానిక శాస్త్రం పట్ల అవగాహన కలిగించాలని వాటిలోని విషయాల పట్ల సంపూర్ణంగా సమాచారం



ఇవ్వాలన్నారు. తద్వారా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయడానికి ఆసక్తిని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు నిపుణులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తున్నామని, వైజ్ఞానిక శాస్త్రంలోని విషయాల పట్ల పరిశోధనాత్మకంగా ప్రత్యక్షంగా బోధించడం ద్వారా వారిలో దాగిన ప్రతిభను వెలికితీస్తున్నామని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రాంమొండయ్య హర్షం, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి , డిసిఇబి కార్యదర్శి భగవంత రావు లు అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విజేతలందరికీ పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో నూతన ఉత్సాహం నింపి అత్యుత్తమ నమూనాలతో ప్రదర్శనకై కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తూ జాతీయస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ చాటే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తాను

– గత 20 సం.. నుండి ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నాను
– కిష్టారం సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థిగా రావి నాగేశ్వరరావు





**సత్తుపల్లి డిసెంబర్03(ప్రజా జ్యోతి)** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా బుధవారం నుండి నామినేషన్ ప్రక్రియ షురూ వేగంగా ప్రారంభమైంది. మండల పరిధిలోని కిష్టారం గ్రామం నుండి స్వతంత్ర అభ్యర్థిగా రావి నాగేశ్వరరావు సర్పంచ్ పదవి కోసం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిష్టారం గ్రామ ప్రజలు ఆశీర్వదించి, అభినందించి,గెలిపిస్తే అభివృద్ధిలో ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దుతానని అన్నారు. గత 20 సంవత్సరాలు కాలం నుండి ఒకే పార్టీలో పనిచేస్తూ,ఎంతోమందికి సేవలందిస్తూ,సింగరేణి సంస్థలో భూములు కోల్పోయిన వారిని పై అధికారుల దగ్గరికి తీసుకెళ్లి డబ్బులు ఇప్పించానని, గ్రామాల్లో ఫంక్షన్లకు ఉచితంగా వాటర్ అందించానని, సింగరేణి కంపెనీతో ధర్నా చేసి గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించానని, శైలో బంకర్ వలన గ్రామస్తులు అనారోగ్యం పాలవుతుంటే ధర్నాలు చేసి, అనేక పోరాటాలు చేసి నూతనంగా గృహాలు నిర్మించానని, కరోనా టైంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40 మందికి భోజనాలు,పల్స్, ఆక్సిమేటర్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వారికి అన్ని విధాల దాతల సహకారంతో అందించానని, గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు పడుతుంటే కిరాణా, సరుకులు,కూరగాయలు అందించానని, దాతల సహకారంతో గ్రామంలో సిసి కెమెరాలు,ట్రాక్టర్, మహాప్రస్థానం వ్యాన్,ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేశామని, పాఠశాల కోసం రూ..3 లక్షలు రూపాయల నిధిని సమకూర్చి,ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకారంగా ఉండే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రజలందరూ నన్ను సర్పంచ్ గా గెలిపిస్తే కిష్టారం గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని, సింగరేణి ఫండ్స్ తోటి కమ్యూనిటీ హాల్,సిసి రోడ్లు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి,పార్క్, పొల్యూషన్ కేంద్రం, హాస్పిటల్ ఏర్పాటు చేపిస్తానని, ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి ఏ లోటు లేకుండా గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని, గత 20 సంవత్సరాలు నుండి స్వార్థం లేకుండా ప్రజలకు సేవలు చేస్తున్నానని, ప్రజలందరూ కలిసి గెలిపిస్తే స్వార్థం లేకుండానే ప్రజలకు మరింత సేవలు చేస్తానని, గ్రామ ప్రజలందరూ గెలిపించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను.

### నామినేషన్ ప్రక్రియను

## పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీజ



**సత్తుపల్లి డిసెంబర్03(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో గల గ్రామపంచాయతీనీ అదనపు కలెక్టర్ శ్రీజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నామినేషన్లు ఎక్కువగా ఉంటుందని, చెరుకుపల్లి కిష్టారం ,యాతాలకుంటల పంచాయతీల్లో వార్డు మెంబర్లు, సర్పంచుల నామినేషన్లు వేగవంతం కావడంతో ఆమె పరిశీలించారు. ఆర్ ఓ లతో మాట్లాడి స్క్రూట్ ని చేసిన తర్వాతే నామినేషన్ ఫామ్ తీసుకోవాలని, నామినేషన్ వేసే అభ్యర్థులకు ఏమైనా తెలియకపోతే దగ్గరుండి వారికి తెలియజేయాలని, నామినేషన్ అభ్యర్థులకు పూర్తి వివరాలు తెలియజేయాలని, నామినేషన్ ఎన్ని వచ్చాయి దరఖాస్తులను పరిశీలించారు. ఆమె వెంట తాసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో చిన్న నాగేశ్వరరావు, ఎంపిఓ జోష్ణ దేవి ఉన్నారు.

### ఆదరించండి, గెలిపించండి

## అభివృద్ధిలో ముందు ఉంచుతాను యశోద

– సదాశివుని పాలెం సర్పంచి బరిలో బిఆర్ఎస్ అభ్యర్థి దుబ్బాక యశోద
– సదాశివుని పాలెం ప్రజలు ఆశీస్సులు కావాలి



**సత్తుపల్లి డిసెంబర్03(ప్రజా జ్యోతి)** స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా బి.ఆర్.ఎస్ పార్టీ బలపరిచిన సదాశివుని పాలెం సర్పంచి అభ్యర్థి దుబ్బాక యశోద సదాశివుని పాలెం బి ఆర్ ఎస్ గ్రామస్తులందరూ,పార్టీ తరఫున సర్పంచి అభ్యర్థిగా బుధవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసేవ చేసే అదృష్టం టిఆర్ఎస్ పార్టీ,అధిష్టానం, గ్రామ ప్రజలందరూ నాపై నమ్మకంతో నిలబెట్టినందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీ అందరి ఆశీస్సులు తో నన్ను గెలిపిస్తే సదాశివుని పాలెం అభివృద్ధిలో ముందు ఉంచుతానని, ప్రజలకు మెరుగైన సేవలు అందించి ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని అన్నారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు మర్చిపోలేని విధంగా తెలంగాణ రాష్ట్రం నుంచి సహాయం పొందారని, సిసి రోడ్లు,బిటి రోడ్లు,రైతులకు నీళ్లు,స్మశాన వాటికలు, రహదారులు, రైతులకు ఎరువులు,రుణమాఫీలు చేసిన ఘనత ఆ పార్టీకే దక్కిందని అన్నారు. ప్రజలు మీ ఆశీస్సులతో గెలిపిస్తే ముందు ముందు ఇంకా మంచి అభివృద్ధి చేస్తానని తెలియజేశారు. స్వార్థం లేకుండా అభివృద్ధి చేస్తానని, ప్రజలకు అండగా ఉంటానని, పెద్దల ఆశీస్సులు ఉన్నాయని, ప్రజలందరూ నన్ను గెలిపించాలని కోరినారు. బుధవారం నామినేషన్ ఫామ్ ను ఎన్నికల అధికారికి దాఖలు చేశారు. దాఖలు చేసిన వారిలో బి ఆర్ ఎస్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ కాల్నేని వెంకటేశ్వరరావు,మందపాటి దామోదర్ రెడ్డి, సూర్యప్రకాష్ రెడ్డి,పర్సా కృష్ణ,భద్రం,శివకృష్ణ,శ్రీను, ఆళ్ల రమేష్,వెంకట్, సోమయ్య,సాంబశివరావు, మామిళ్ళ వెంకటేశ్వరరావు, సుజాత,కృష్ణవేణి తదితరులున్నారు.

### మెప్మా ఆధ్వర్యంలో

## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను మెప్మా ఆధ్వర్యంలో ఖమ్మం నగర పాలక సంస్థ ఘనంగా నిర్వహించింది. ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఈరోజు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన దివ్యాంగులందరికీ ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు తప్పనిసరిగా సంఘాల్లో సభ్యులుగా చేరాలని మున్సిపల్ అధికారులు సూచించారు. సంఘాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తున్నాయని,గ్రూపుల ఆధారంగా ప్రభుత్వ పథకాల కింద రుణాలు సులభంగా అందుతున్నాయని తెలియజేశారు. పీఎం స్వ నిధి స్కీమ్ కింద ఇప్పటికే అనేక మంది దివ్యాంగులకు ఒక్కో విడతగా 10,000 నుండి 50,000 వరకు రుణాలు మంజూరు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెండు కొత్త దివ్యాంగుల సంఘాలను ఏర్పాటు చేసి రుణ మంజూరు పత్రాలను అందజేశారు. అదేవిధంగా కొంతమంది దివ్యాంగులు ఇందిరా మహిళా శక్తి ద్వారా జీవనోపాధి పొందుతున్నారని వివరించారు. ఇంకా వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా దివ్యాంగుల జీవన విధానాన్ని మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని,మున్సిపాలిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వయం ఉపాధి ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న దివ్యాంగులను గుర్తించి మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, డిఎంసీ, టీఎంసీ, సి ఒ ల తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం







**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ను ఏర్పాటు చేయగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. డి. రామారావు పాల్గొని మాట్లాడారు. డిసెంబరు 3వ తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నామని, దివ్యాంగుల రాజకీయ, సామాజిక,ఆర్థిక, సాంస్కృతిక పరంగా ఎదుగుదలను ప్రోత్సహించేలా మనమందరం తోడుగా, అండగా వుందామని, హక్కులు పూర్తిగా గౌరవంగా అందేలా అధికారులు సహాయం చేయాలనీ, సమస్యలు,ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని,సమాన అవకాశాలలో భాగస్వామ్యం చేయాలనీ, శారీరక వైకల్యత వల్ల దివ్యాంగులు అనేక ఇబ్బందులు పడుతారని, వారి మానసిక, శారీరక ఆరోగ్యం కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పక్షాన నిరంతరం అవసరమైన సేవలు అందిస్తామని,క్యాన్సర్,హైపర్ టెన్షన్, మధుమేహం మొదలైన అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ కార్యక్రమాలు ఏర్పాటుచేసి దివ్యాంగుల ఆరోగ్యం పట్ల మంచి నిబద్ధతతో కూడిన సేవలను అందిస్తామని, బుధవారం మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.డి.రామారావు తెలిపారు.వైద్య శిబిరంలో డాక్టర్లు కృష్ణ చైతన్య, సాయి కుమార్,ఏ.ఎన్.ఎం.దయమణి,డి ఈ.ఓ.నాగలక్ష్మి, ఆశ కార్యకర్తలు అరుణ,వరలక్ష్మి, పద్మ, ఝాన్సీ,రఫియా వైద్య సేవలు అందించారు.బాలసదనం ను సందర్శించిన డి.ఎం.హెచ్. ఓ.బాలసదన్ లో పిల్లల దత్తత కోసం అప్లికేషన్లు పెట్టుకున్నవారి అప్లికేషన్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పరిశీలించాల్సి వుంటుంది కాబట్టి అందుకోసం బాలసదన్ ను సందర్శించారని,ఆర్.బి.ఎస్.కే. టీం ను పంపించి డాక్టర్, సిబ్బందితో ప్రతినెల బాలసదన్ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తానని, పిల్లలకోసం కావలసిన మందులను ప్రభుత్వ జనరల్ హాస్పటల్ నుండి ఏర్పాటు చేయిస్తానని, రొటీన్ చెకప్ లలో భాగంగా సమీప పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్, సిబ్బందితో వైద్యపరీక్షలు నిర్వహిస్తామని, బాలసదన్ పరిసరాలు పరిశుభ్రంగా వుండాలని, దోమలు పుట్టకుండా,కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని, పిల్లలకు అందిస్తున్న భోజనం, మంచినీరు ఏర్పాట్లు సుచి, శుభ్రతతో పాటించాలని, కేర్ టెకర్స్ ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రాక్టీస్ లో పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.డి.రామరావు తెలిపారు.బాలసదన్ నిర్వాహకులు డి.సి.పి.వో టి. విష్ణు వందన,ఇంచార్జీ మేనేజర్ కే. యశోద, చైల్డ్ హోమ్ మరియు శిశుగృహ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

– ఆర్‌సిఓఏ క్లబ్‌లో ఆటలా పోటీలు





**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 3 – ప్రజాజ్యోతి:** కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ ఆర్‌సిఓఏ క్లబ్ లో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ సంయుక్తముగా దివ్యాంగులకు ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు, విశిష్ట అతిథిగా జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, గౌరవ అతిథిగా కొత్తగూడెం ఏరియా సేవా ప్రెసిడెంట్ జి.మధుర వాణి లు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ...సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ వ్యాప్తముగా నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలలో భాగముగా కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాలు సంయుక్తముగా ఈ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించుకుంటున్నామని అన్నారు. సింగరేణి సంస్థ ప్రతీ ఏడాది ఈ వేడుకలకు ప్రత్యేకముగా బడ్జెట్ ను కేటాయిస్తున్నది అని తెలిపారు. "సురక్షితమైన సమగ్రమైన సమాజం లో దివ్యాంగులను భాగస్వామ్యం చేయటం" అనే నినాధం తో ఈ వేడుకలను నిర్వహించుకుంటున్నాం అని, వారి హక్కుల గురించి మరియు సమాజం లో వారిని కూడా భాగస్వామ్యం చేయటమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని, దివ్యాంగులకు సేవ చేస్తే దేవునికి సేవ చేసినట్లే అని వారి అభివృద్ది కి ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహాయాన్ని అందించాలని కోరారు. మంచిగా ఉన్న పిల్లలనే చూడటం కష్టంగా ఉన్న ఈ రోజులలో దివ్యాంగులైన పిల్లల కొరకు చాలా ఓపికగా సేవా దృక్పథంతో పాల్వంచలో దివ్యాంగుల కొరకు నిర్వహిస్తున్నటువంటి శాంతి వెల్ఫేర్ స్కూల్ నిర్వహకులను, గౌతమి దివ్యాంగుల స్కూల్ సిబ్బందిని అభినందించారు. అనంతరం దివ్యాంగులకు ఆటల పోటీలు మరియు సాంస్కృతిక పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కొత్తగూడెం ఏరియా గుర్తింపు సంఘం (ఏఐటియూసి) అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జే.గట్టయ్య, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఏజిఎం(పర్సనల్) జివి మోహన్ రావు, డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవ రావు, డివై. పిఎం లు జి.హరీష్, కే.సునిల్ కుమార్, సీనియర్ పిఓ లు ఎం.మురళి, ఎన్.సుజ్ఞాన్, శాంతి వెల్ఫేర్ డెఫ్ అండ్ డంబ్ ప్రిన్సిపల్ క్రిసోలైట్, గౌతమి దివ్యాంగుల స్కూల్ ప్రిన్సిపల్ గౌతమి, ఉపాధ్యాయులు, 40 మంది దివ్యాంగులు, సేవా కొ-ఆర్డినేటర్ సిహెచ్. సాగర్, సింగరేణి సేవా సెక్రెటరీలు అనిత, సేవా సభ్యులు, పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసుల అవగాహన

ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** స్థానిక ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని,ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద డ్రైవర్లకు పలు అంశాలపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఆటోలో ఎక్కువ మందిని ఎక్కించుకోవద్దని, డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులు కూర్చోరాదని అన్నారు. ఆటోను కండిషన్‌లో ఉంచుకునేలా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వెంటనే ఫస్ట్ ఎయిడ్ నిమిత్తం ఆసుపత్రులకు తరలించి మానవత్వం చూపించాలన్నారు. ఆటోలకు హైఓల్టేజీ బల్బులు అమర్చి ఎదురుగా వచ్చే వారికి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ప్రయాణికులు ఇబ్బందులకు గురైతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## చొప్పకట్లపాలెం స్కూల్‌లో స్పెషల్ ఆఫీసర్ తనిఖీ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** బోనకల్ మండలంలోని చొప్పకట్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె విజయభాస్కర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి పుల్లయ్య బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల హాజరును పరిశీలించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ ప్రోగ్రామ్ ను కూడా పరిశీలించారు. ఇక్కడ 80% నుండి 90% వరకు పిల్లలు చదువుకుంటున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు స్పెషల్ ఆఫీసర్ కు నివేదించారు. విద్యార్థులకు స్కూల్ లో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా స్పెషల్ ఆఫీసర్ పరిశీలించారు. ఇక్కడ ఉన్నటువంటి 40 మంది పిల్లలకు ఈ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రంగా, నాణ్యతతో అందిస్తున్నట్లు తనిఖీ అధికారులు గమనించారు. తమ పిల్లలకు అందిస్తున్న తరహాలోనే పాఠశాల సిబ్బంది చాలా శ్రద్ధతో వంట చేశారని ప్రశంసించారు. అదేవిధంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బోనకల్ మండలంలోని దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు.



### ఎన్నికల శిక్షణా కేంద్రాలను పరిశీలించిన

## సాధారణ పరిశీలకులు సర్వేశ్వర్ రెడ్డి



**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 3, ప్రజా జ్యోతి** గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పర్యవేక్షణకు నియమితులైన పరిశీలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి బుధవారం జిల్లాలోని పలు మండలాలను సందర్శించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న లోపం చోటుచేసుకోకుండా అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని ఆయన పలు సూచనలు జారీ చేశారు. ముందుగా ఆయన ఆర్వోలు ఏ ఆర్ ఓ ల శిక్షణ కేంద్రాలను సందర్శించారు. ఈ పరిశీలనలో భాగంగా పాల్వంచ మండలంలోని అనుబోస్ కాలేజీలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని తనిఖీ చేసి, శిక్షకులు ఇస్తున్న మార్గదర్శకాలు, శిక్షణ పాఠ్యాంశాలు, హాజరు రికార్డులు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. అనంతరం బర్గంపహాడ్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, భద్రాచలం మండలంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి అందజేస్తున్న నామినేషన్ ప్రక్రియ, కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల రోజున చేపట్టాల్సిన వివిధ విధులపై శిక్షణ నాణ్యతను సమీక్షించారు. శిక్షణా కేంద్రాల్లో మౌలిక వసతులు, సమృద్ధిగా ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, "గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైనవని ,ప్రతి ఆర్వో , ఏ ఆర్ ఓ లు ఎన్నికల సిబ్బంది చట్టబద్ధంగా తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు, శిక్షణా దశలోనే అన్ని విధానాలు పూర్తిగా అవగాహన చేసుకుని తర్వాత క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలని, ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలిగించే అవకాశం ఉన్నందున ప్రతి చర్యలో జాగ్రత్త వహించాలి" అని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని సూచనలు, మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని ఆయన అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన పరిశీలకులు లక్ష్మీదేవిపల్లి మండలంలోని జీపీ లక్ష్మీదేవిపల్లి, జీపీ శ్రీనగర్ కాలనీ , అదేవిధంగా సుజాత్‌నగర్ మండలంలోని జీపీ సీతంపేట బంజారా, జీపీ సర్వారం కేంద్రాలను సందర్శించారు. నామినేషన్ స్వీకరణ, రికార్డు నిర్వహణ, భద్రత, సిబ్బంది హాజరు, క్యూలైన్ వ్యవస్థ మొదలైన అంశాలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా కార్యాచరణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందని పరిశీలకులు తెలిపారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతిని సమగ్రంగా
# తయారు చేశాం

మొదటిపేజీ తరువాయి..

తెలిపారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధం చేశామని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వాటిని పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడి ఇందుకు సంబంధించిన వివరాలు




వెల్లడించారు. భూదార్ కార్డులు సిద్ధం చేశామని.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అందజేస్తామని చెప్పుకొచ్చారు. రెండో విడతలో 373 నక్షలేని గ్రామాల్లో సర్వే చేస్తామని..ఎన్నికల తర్వాత భూదార్ కార్డులు అందజేస్తామని తెలిపారు. రెండేళ్ల ప్రజా పాలనలో కేసీఆర్ హయాంలో తీసుకువచ్చిన ధరణిని బంగాళాఖాతంలో వేశామని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలో ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామన్నారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధంగా ఉన్నాయన్నారు. భూభారతి చట్టంతో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. ధరణిని బీఆర్ఎస్ సర్కార్ విదేశీ సంస్థకు అప్పగించిందని చెప్పారు. కాంగ్రెస్ పవర్లోకి వచ్చాక భూ భారతిని కేంద్ర సంస్థకు అప్పగించామన్నారు. భయంకరమైన ధరణి వెబ్ సైట్ ను బంగాళాఖాతంలో పడేశామన్నారు. స్థానిక ఎన్నికల తర్వాత నక్షల్లేని గ్రామాల్లో సర్వేలు చేసి భూధార్ కార్డులిస్తామని తెలిపారు. ధరణి వెబ్ సైట్ తో బీఆర్ఎస్ రెవెన్యూ వ్యవస్థను కుప్పకూల్చిందన్నారు.ప్రజలు మెచ్చే భూ భారతి చట్టాన్నితమ ప్రభుత్వంలో తీసుకువచ్చామని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద నక్షలేని 5గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశామని వివరించారు. ఇవాళ(బుధవారం) తెలంగాణ సచివాలయంలో మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు.

# గ్లోబల్ సమిట్‌కు రండి

మొదటిపేజీ తరువాయి..

హైదరాబాద్–బెంగళూరు–చెన్నై బుల్లెట్ రైలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి



చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని అభ్యర్థించారు. పలువురు కేంద్ర మంత్రులతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను కలిసిన సీఎం సమ్మిట్‌కు ఆహ్వానించారు. కాగా, మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి గ్లోబల్ సమిట్‌కు రావాలని కోరారు. తరవాత సిఎం రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో ..తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉ ంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిందూ సమాజంలాంటిదే కాంగ్రెస్ అని డీసీసీ అధ్యక్షులకు చెప్పానని సిఎం వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఉత్తర భారతంలోనూ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు.

తాను కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన విషయాల్లో ముందు వెనక కట్ చేసి కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు తెలంగాణలో తన నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. హిందూ దేవుళ్లు, హిందూ సమాజం లాంటిదే కాంగ్రెస్ అని కొత్తగా ఎన్నికైన తమ పార్టీ జిల్లా అధ్యక్షులకు చెప్పినట్లు వివరించారు. సమావేశంలో పార్టీ నాయకుడిగా ఎలా పనిచేయాలో తాను చెప్పినట్లు తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోవడంతో ఈ విషయాన్ని పెద్దదిగా చేసి వివాదాస్పదం చేస్తోందని ధ్వజమెత్తారు. హిందూ దేవుళ్లు మూడు కోట్ల మంది ఉన్నారని? పలు సారూప్యతలు కలిగిన దేవుళ్లు ఉ న్నారని తాను చెప్పానని అన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కూడా హిందూ సమాజం లాంటిదేనని అని పోలుస్తూ



తాను వ్యాఖ్యానించానని స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పలు కీలక అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారంపిసిసి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో సీఎం మాట్లాడిన మాటలను కొంతమంది సోషల్ మీడియాలో వక్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు.

తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ప్రధాని మోడీని కోరాను.. మీరు ముఖ్యమంత్రిగా ఉ న్నప్పుడు గుజరాత్ రాష్ట్ర అభివృద్ధికి నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సహకరించారని తెలిపాం.. అలాగే, రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని మోడీకి పలు వినతులు చేశాం.. ఆర్ఆర్ఆర్ సౌత్ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధాన మంత్రిని కోరామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, డిసెంబర్ 8, 9న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్, మనోహర్ లాల్ ఖట్టర్, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆహ్వానించారు. అలాగే, భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి వివరించిన ఆహ్వాన పత్రికను వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. ం

## హిందూదేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి..

చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని గాంధీభవన్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ..నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్ధలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉ ద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉ దాహరించారని చెప్పారు.

## సభా హక్కుల ఉల్లంఘన ఇస్తే గట్టిగా జవాబిస్తా

### కుక్క వ్యవహారంపై రేణుకా చౌదరి ఘాటు స్పందన

న్యూఢిల్లీ,డిసెంబరు3 (ప్రజాజ్యోతి): కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఎంపీ రేణుకా చౌదరి తన కారులో ఒక కుక్కను తీసుకుని పార్లమెంటు ఆవరణలోకి రావడం ఇటీవల సంచలనమైంది. ఎంపీలకు కల్పించిన హక్కులకు ఇది విరుద్ధమని బీజేపీ దీనిపై మండిపడగా, ఆమెపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టనున్నారనే ప్రచారం జరిగింది. దీనిపై పార్లమెంటు వెలుపల ఆమెను మీడియా



బుధవారంనాడు ప్రశ్నించినప్పుడు ఆమె 'బౌ బౌ' అంటూ రియాక్షన్ ఇచ్చారు. 'ఇంతకంటే ఏమి చెప్పాలి? తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు చూద్దాం. సమస్య ఏముంది? అది వచ్చినప్పుడు గట్టి సమాధానమిస్తాను' అని చెప్పారు. పార్లమెంటు సమావేశాల రేణుకా చౌదరి కారులో ఒక శునకాన్ని తీసుకుని పార్లమెంటు ఆవరణలోకి వచ్చారు. వెంటనే భద్రతా సిబ్బంది ఆ కుక్కను వెనక్కి పంపేశారు. తాను రోడ్డుపై వస్తున్నప్పుడు రెండు వాహనాలు ఢీకొని మధ్యలో కుక్కపిల్ల కనిపించిందని, అది గాయపడి ఉంటుందని భావించి కారులో తీసుకువచ్చానని, ఇక్కడకు వచ్చిన వెంటనే ఆ కుక్కను తన ఇంటికి పంపించేశానని చెప్పారు. ఇందులో సమస్య ఏముందని ప్రశ్నించారు. రేణుకా చౌదరి చర్యను బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ తప్పుపట్టడంతో ఆమె తిరిగి స్పందించారు. కాలుష్యంతో జనం చనిపోతున్నారు. దానిపై ఎవరికీ ఎలాంటి బాధ లేదు. బీఎల్ఓలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వాళ్ల కుటుంబాలు అతలాకుతలమవుతున్నాయి. అయినా వాళ్లకు ఎలాంటి పట్టింపూ లేదు. కార్మిక చట్టాలు రుద్దుతున్నారు. సంచార్ సాథీ యాప్ బలవంతంగా మనపై రుద్దుతున్నారు. కానీ రేణుకా చౌదరి కుక్క అందరికీ ఆందోళనకరమైన విషయంగా కనిపిస్తోంది. ఇంతకంటే ఏమి చెప్పాలి? మూగజీవాలను నేను ప్రేమిస్తూనే ఉంటాను' అని అన్నారు. పార్లమెంటు ఆవరణలోకి కుక్కలు రాకూడదనే నిషేధం ఏదీ లేదని, అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా ఒకసారి ఎద్దులబండిపై వచ్చారని గుర్తుచేశారు.

## మూగ బాలుడిపై కుక్కల దాడి

మొదటిపేజీ తరువాయి..

వ్యక్తం చేశారు. కుక్కల దాడిలో గాయపడిన బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వారిని అదేశించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అతడికి అవసరమైన తక్షణ సాయం అందించాలని సూచించారు. స్వయంగా బాలుడిని పరామర్శించటంతో పాటు, ఆ కుటుంబాన్ని కూడా కలిసి.. వారి బాగోగులు పరిశీలించి, ప్రభుత్వ పరంగా వారిని ఆదుకోవాలని కమిషనర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో జరిగిన సంఘటనలు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని. . తక్షణం వీధి కుక్కల దాడుల కట్టడికి చర్యలు చేపట్టాలని ఆయన అదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హయత్‌నగర్ షిర్డీ నగర్‌లో బి తిరుపతి, చంద్రకళ దంపతులు నివసిస్తున్నారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా తిరపతి పని చేస్తున్నాడు. అతడి భార్య చంద్రకళ కూలీ పని చేస్తుంది. వీరికి ప్రేమ్‌చంద్ (8) కుమారుడు ఉన్నాడు. అతడికి మాటల రావు. మంగళవారం ఉదయం ప్రేమ్ చంద్.. తన ఇంటి సమీపంలోని కిరాణ దుకాణానికి వెళ్తున్నాడు. కుక్కల గుంపు అతడిపై మూకుమ్మడిగా దాడి చేశాయి. శీతాకాలం కావడంతో అతడు స్వెటర్ ధరించాడు. స్వెటర్‌ను నోటితో కరిచి అతడిని కొంత దూరం లాక్కెళ్లాయి. ప్రేమ్ చంద్ మూగవాడు కావడంతో కేకలు వేయలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి.. రాళ్లు విసిరి కుక్కలను తరిమికొట్టారు. ఈ ఘటనలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి.. 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. వాహనంలో అతడిని ఫీవర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడికి మెరుగైన వైద్య చికిత్స కోసం నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి చెవకి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలుడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు అతడి తల్లిదండ్రులు వెల్లడించారు. ఈ సంఘటనపై పత్రికలో వార్త కథనాలు వెలువడడంతో సీఎం రేవంత్ రెడ్డి పైవిధంగా స్పందించారు.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967